మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 16-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 17 Issue: 17

16 జూలై 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:54 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి విదియ ఉ. 8:55 వరకు తరువాత తదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఆశ్లేష రా. 7:54 వరకు తరువాత మఖ యోగం సిద్ధి రా. 1:20కు కరణం కౌలవ ఉ. 8:55 వరకు తైతుల రా. 7:41 వరకు వర్జ్యం ఉ. 9:33 నుండి ఉ. 11:01 వరకు దుర్ముహూర్తం ఉ. 10:12 నుండి ఉ. 11:04 వరకు మ. 3:23 నుండి సా. 4:14 వరకు రాహుకాలం మ. 1:59 నుండి మ. 3:36 వరకు యమగండం తె. 5:54 నుండి ఉ. 7:31 వరకు గుళికాకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:45 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:18 నుండి తె. 5:06 వరకు అమృత ఘడియలు రా. 7:03 నుండి రా. 8:32 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

### 3 వరకు దరఖాస్తుల స్వీకరణ

### ఆగస్టు 10న ముసాయిదా, అక్టోబర్ 12న తుది జాబితా

**తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్యుమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని స్పష్టం చేసింది. తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే తేదీలోగా పూర్తి చేయనున్నారు.**

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణలో సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అనంతరం, అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లోనూ తుది ఓటర్ల తరువాయి 2 వ పేజీలో...



## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో సిలిండర్ డెలివరీ

హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): ఆన్‌లైన్ ఫుడ్, గ్రోసరీ డెలివరీ దిగ్గజం 'స్విగ్గీ' వినియోగదారుల కోసం మరో సరికొత్త సేవను అందుబాటులోకి తెచ్చింది. ప్రముఖ చమురు సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌తో చేతులు కలిపి ఆన్-డిమాండ్ ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీని ప్రారంభించింది. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ సేవ ద్వారా ఆర్డర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సిలిండర్ వినియోగదారుడి ఇంటికి తరువాయి 2 వ పేజీలో...



### బ్యాంకుల సేవా లోపాలకు

## రూ.33 లక్షల పరిహారం

న్యూఢిల్లీ: బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల సేవల్లో లోపాల వల్ల నష్టపోయిన వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఒక కీలకమైన అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. సంబంధిత సంస్థ వద్ద తమ ఫిర్యాదు పరిష్కారం కానప్పుడు, నేరుగా ఆర్‌బీఐని ఆశ్రయించి రూ.33 లక్షల వరకు పరిహారం పొందేందుకు వీలు కల్పించింది. ఈ ఏడాది జులై నుంచి అమల్లోకి వచ్చిన 'రిజర్వ్ బ్యాంక్ - ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ స్కీమ్ (ఆర్బీ-ఐఓఎస్)-2026' కింద -2 వ పేజీలో...



## పెయ్యి ఉడుకుతది!

### నేడు రాష్ట్రంలో వింత వాతావరణం.. 5 జిల్లాలకు ఉక్కపోత హెచ్చరిక

### జులై 22 వరకు పొడి వాతావరణం.. హైదరాబాద్‌లో 36 డిగ్రీలకు ఉష్ణోగ్రత

హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): తెలంగాణలో రుతుపవనాలు బలహీనపడటంతో వర్షాకాలం లోనూ పొడి వాతావరణం కొనసాగుతోంది. రాష్ట్రంలో వర్షపాతం లోటు ఆందోళన కలిగిస్తుండగా, మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఐదు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. బుధవారం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గురువారం తీవ్రమైన ఉక్కపోత ప్రభావం చూపే అవకాశం ఉంది. వీటితో పాటు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం తరువాయి 2 వ పేజీలో...

## అమెజాన్‌తో ఫ్యూచర్



### ఫోర్త్ సిటీ అభివృద్ధికి మైలురాయి

### డేటా సెంటర్ శంకుస్థాపనలో సీఎం రేవంత్

**తెలంగాణకు 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని వెల్లడి**

**ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలకు ఆహ్వానం**

**ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల మరిన్ని పెట్టుబడులు, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.**

హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలను ఆహ్వానిస్తున్నామని రేవంత్ తెలిపారు. గతేడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు 108 దేశాల నుంచి పరిశ్రమలు పాల్గొన్నా యని గుర్తు చేశారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దతామని పేర్కొన్నారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో తెలంగాణ వాటా 10 శాతం ఉండేలా కృషి చేస్తామని అన్నారు. ఈ లక్ష్యాల సాధనకు తరువాయి 2 వ పేజీలో...



## సీసీఐపై సప్పుడు లేదు!

### రాష్ట్రం నుంచి స్పందన లేదని కేంద్ర మంత్రి అన్నారు

### వెంటనే మైనింగ్ లీజును పొడిగించాలి: కేటీఆర్

**సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం కేటీఆర్ బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు,ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది.**

న్యూఢిల్లీ: అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు తరువాయి 2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,357 |
| వెండి (కిలో): | రూ.2,40,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,059 |

## పోక్సో.. జర లూజు!

### చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి.. పోలీసుల వైఫల్యం వల్లే షాబాద్ ఘటన

### బాధితులకు రక్షణ కల్పించలేకపోయారు... సీఎం రేవంత్‌కు పవన్ కల్యాణ్ లేఖ

**తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు.**



మంగళగిరి/హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ తరువాయి 2 వ పేజీలో...



## కాంగ్రెస్ వల్లే 'పోక్సో' బెయిల్

### ఇదేనా మహిళలకు రక్షణ?.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం

హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మహిళల భద్రత పూర్తిగా గాలికి కొట్టుకుపోయిందని, ఆడబిడ్డలను కాపాడుకునే నాథుడే కరవయ్యాడని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ దారుణ ఉదంతంపై ఆయన మాట్లాడారు. ఈ కేసులో ప్రభుత్వం, పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వ్యవహరించిన తీరు సరిగా లేదని ఆరోపించారు. మే 16వ తేదీనే బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని... నిందితుడు ఎవరో, ఏం చేశాడో వివరించినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. నిందితుడు ముందస్తు బెయిల్ తెచ్చుకునే వరకు కూడా అతన్ని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు. ఎల్‌బీ నగర్ పోక్సో కోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌ను తాను పరిశీలించానని, అందులో చనిపోయిన బాలిక సోదరుడు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ఏదైనా పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు పెద్దగా ఆలోచించకుండానే "ఇదే సరైన నిర్ణయం" అనే భావన కలగడం సాధారణమే. దీనినే సాధారణంగా 'గట్ ఫీలింగ్' లేదా అంతర్జ్ఞానం అంటారు. అయితే ఈ భావన నిజానికి కడుపు నుంచి కాకుండా మెదడు నుంచి ఉద్భవిస్తుందని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పరిశోధకుల వివరాల ప్రకారం, మనకు తెలియకుండానే మెదడు గత అనుభవాలు, జ్ఞాపకాలు, భావోద్వేగ సంకేతాలు, ప్రస్తుత పరిస్థితులను అత్యంత వేగంగా విశ్లేషిస్తుంది. ఈ సమాచారాన్ని క్షణాల్లో పోల్చి చూసి ఒక నిర్ణయానికి వస్తుంది. అందుకే ఆ నిర్ణయం వెనుక కారణాన్ని వెంటనే చెప్పలేకపోయినా, "ఇదే సరైనది" అనే బలమైన నమ్మకం కలుగుతుంది.



## దేవదేవుడు.. కదిలొస్తున్నాడు!

### నేడే పూరి జగన్నాథ రథయాత్ర.. హైదరాబాద్‌లోనూ ఇస్కాన్ ఏర్పాట్లు

పూరి/హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): పూరిలో శ్రీజగన్నాథస్వామి రథయాత్రకు సర్వం సిద్ధమైంది. గురువారం రథయాత్ర జరగనుండగా.. దేవస్థానం, ఒడిశా ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేశాయి. బలభద్రుడి రథం తాళధ్వజం, దేవి సుభద్ర రథం దర్పదళనం, జగన్నాథుడి రథం నందిఘోషను సర్వాంగ సుందరంగా అలకరించారు. పూరి శంకరాచార్య స్వామి, నిశ్చలానంద సరస్వతి సందర్శన, గజపతి మహారాజు రథాన్ని ఊడ్చే సంప్రదాయ కార్యక్రమాలు ముగిసిన తర్వాత గురువారం సాయంత్రం 4 గంటలకు రథయాత్ర ప్రారంభం కానుంది. అటు.. ఇస్కాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సుమారు లక్ష మంది భక్తులతో జగన్నాథ రథయాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తిచేసినట్లు హైదరాబాద్ టెంపుల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ కన్వీనర్ వరద కృష్ణ దాస తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర ఆర్టీసీ తరువాయి 2 వ పేజీలో...



## అమెరికాలో 'ట్రంప్' కాయిన్

### 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల

వాషింగ్టన్: అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం 250 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో కొత్త ఒక డాలర్ నాణేన్ని ముద్రించనున్నట్లు యునైటెడ్ స్టేట్స్ మింట్ ప్రకటించింది. ఈ విషయాన్ని తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
16.7.2026

మేషం: ఈరోజు కార్యాలయంలో మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది మరియు వ్యాపారస్తులకు నూతన భాగస్వామ్యాలు అనుకూలిస్తాయి. ఆదాయం బాగున్నప్పటికీ, అనుకోని ఖర్చులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి పొదుపుపై దృష్టి పెట్టండి. కుటుంబ సభ్యులతో విభేదాలు తొలగిపోయి మానసిక ప్రశాంతత లభిస్తుంది.

వృషభం: వృత్తిపరంగా సానుకూల మార్పులు ఉంటాయి మరియు సహోద్యోగుల మద్దతుతో పెండింగ్ పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. పాత బాకీలు వసూలవడంతో ఆర్థిక పరిస్థితి గతంలో కంటే మెరుగ్గా ఉంటుంది. అయితే, ప్రయాణాల సమయంలో కొద్దిపాటి జాగ్రత్త అవసరం.

మిథునం: నూతన ప్రాజెక్టులు లేదా వ్యాపార పనులు ప్రారంభించడానికి అత్యంత అనుకూలమైన సమయం. మీ ఆలోచనలకు మంచి స్పందన లభిస్తుంది. ఆదాయ మార్గాలు పెరగడంతో పాటు విలువైన వస్తువులు కొనుగోలు చేసే అవకాశం ఉంది. బంధుమిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు.

కర్కాటకం: పనిభారం పెరిగే అవకాశం ఉంది కాబట్టి సహనంతో మరియు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలను చేరుకోండి. అనవసరపు ఖర్చులను నియంత్రించుకోవడం మంచిది. శారీరక, మానసిక ఒత్తిడికి లోనవకుండా ధ్యానానికి కొద్దిగా సమయం కేటాయించండి.

సింహం: మీ నాయకత్వ లక్షణాలకు కార్యాలయంలో ప్రశంసలు దక్కుతాయి మరియు వ్యాపారంలో ఆశించిన లాభాలు వస్తాయి. ఆర్థికంగా ధనలాభం సూచిస్తోంది. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. కోపాన్ని అదుపులో ఉంచుకోవడం వల్ల సత్సంబంధాలు దెబ్బతినకుండా ఉంటాయి.

కన్య: అనుకున్న పనులు సమయానికి పూర్తి కావడంతో ఎంతో ఉత్సాహంగా ఉంటారు. పై అధికారుల మద్దతు లభిస్తుంది. ఆర్థికంగా స్థిరత్వం ఉంటుంది మరియు భవిష్యత్తు కోసం కొత్త ప్రణాళికలు రచిస్తారు. పాత స్నేహితులను కలుసుకోవడం ఆనందాన్ని ఇస్తుంది.

తుల: ఉద్యోగ రంగంలో మిశ్రమ ఫలితాలు ఉంటాయి. శ్రమకు తగిన ప్రతిఫలం ఆలస్యంగానైనా అందుతుంది. ఖర్చుల విషయంలో ఆచితూచి అడుగు వేయడం శ్రేయస్కరం. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు తొందరపాటు వద్దు, పెద్దల సలహాలు తీసుకోండి.

వృశ్చికం: సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధిస్తారు. నూతన పరిచయాలు మీ వ్యాపార అభివృద్ధికి తోడ్పడతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నాయి. గతంలో నిలిచిపోయిన డబ్బు చేతికి అందుతుంది. పూర్తి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తారు.

ధనస్సు: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాల్లో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. ధన ప్రవాహం బాగుంటుంది మరియు గత పెట్టుబడుల నుండి మంచి లాభాలు వస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపుతారు.

మకరం: కార్యాలయంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉండవచ్చు, కాబట్టి ఓర్పు మరియు పట్టుదలతో పనులను పూర్తి చేయండి. ఖర్చులు పెరగకుండా బడ్జెట్ ప్లాన్ చేసుకోవడం అవసరం. ఆహార నియమాల విషయంలో జాగ్రత్త వహించండి, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి.

కుంభం: నూతన ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆకస్మిక ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులు మీ మాటతో విబేదిస్తారు. మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి. ఉద్యోగమున సహోద్యోగులతో వివాదాలు పరిష్కారమౌతాయి.

మీనం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగ్గా ఉంటుంది. నూతన వస్తులాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. భూ సంభందిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. గృహమున శుభాకార్యములు నిర్వహిస్తారు.



# అమెజాన్‌తో ఫ్యూచర్

మొదటి పేజీ తరువాయి

భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు అవసరమని, అందుకే 'తెలంగాణ రైజింగ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం మంత్రులు, అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు నగరంలోని పరిశ్రమలను దశలవారీగా తరలిస్తామని, మెట్రో విస్తరణ చేపడతామని సీఎం వెల్లడించారు. డీజిల్‌తో నడిచే ఆర్టీసీ బస్సులను నగరం వెలుపలికి తరలించి, వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి జీరో ట్యాక్స్ విధించే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి కాలుష్య రహితంగా మారుస్తామని, మెట్రో విస్తరణ, మూసీ పునరుద్ధరణ, పరిశ్రమల తరలింపుతో కూడిన ప్రాంతాన్ని 'కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)'గా అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో సేవల రంగానికి అనుగుణంగా పునర్నిర్మిస్తామని చెప్పారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు 10 కిలోమీటర్ల పరిధిని తయారీ పరిశ్రమల (మ్యాన్యుఫ్యాక్చరింగ్) జోన్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని రేవంత్ అన్నారు. వారికి ఎలాంటి నష్టం జరగకుండా తగిన పరిహారం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



# సీసీఐపై సప్పుడు లేదు!

మొదటి పేజీ తరువాయి

చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు.

బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పామన్నారు. సీసీఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయం. మేం కూడా దీన్ని మళ్లీ నడపాలని కోరికతోనే ఉన్నామని కేంద్రమంత్రి అన్నారని కేటీఆర్ వెల్లడించారు. దాదాపు 230 ఎకరాలు అక్కడ ల్యాండ్ ఉన్నది. ఒక 770 ఎకరాలు ప్రైవేట్ పట్టా ల్యాండ్ కంపెనీకి ఉంది. అట్లాగే 1500పై చిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ ఉంది.

మరి 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీతో పెడితే బాగుంటదన్నారు. ఏమైంది ఎందుకు తెరవలేకపోతున్నరని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించడం లేదు.. సంవత్సర కాలంగా మేం ప్రయత్నం చేస్తున్నం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ పొడిగించాలి. వాళ్లు ముందుకు రావడం లేదు.

మరి రాష్ట ప్రభుత్వం ఏం సబ్సిడీ ఇస్తదా.. ఏమన్నా పెట్టుబడి పెడ్తతా..? జీఎస్టీ మినహాయింపు ఇస్తదా.. చెప్పమంటే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి పెద్దగా స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారని కేటీఆర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రికి సీసీఐ సాధన సమితి తరపున ధన్యవాదాలుతెలియజేస్తూ.. మేం అధికారంలో ఉన్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లు తెరిపించాం.

అదే ఆదిలాబాద్‌జిల్లాలో మళ్లీ వెంబడ పడి తిరిగి తెరిపించి ఇవాళ వేలాది మందికిఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినం. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వారు ముందుకొచ్చిమైనింగ్ లీజ్‌ను ఎక్స్‌టెండ్ చేయాలి. రూ.2 వేల కోట్ల పెట్టుబడి అంటే రాష్ట్రప్రభుత్వం తరుపున మీరేం ప్యాకేజీ ఇస్తారో చెప్పాలన్నారు. సీసీఐని పునరుద్దరిస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారు. సీసీఐని పునరుద్దరిస్తే వేలాదిమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

# పోక్సో.. జర లూజు!

మొదటి పేజీ తరువాయి

ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### పెయ్యి ఉడుకుతది!...

పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా జులై 22 వరకు పొడి వాతావరణమే కొనసాగుతుందని, తేలికపాటి జల్లులు మినహా భారీ వర్షాలకు అవకాశం లేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్క హన్మకొండ జిల్లాలోనే ఈ జులై నెలలో ఇప్పటివరకు 65 శాతం వర్షపాతం లోటు నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, ఇటీవల నల్గొండలో 38.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఉన్నప్పటికీ, రుతుపవన ద్రోణి రాష్ట్రంలో వర్షాలకు అనుకూలంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.



# తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

జాబితాను విడుదల చేస్తారు. ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) చేపట్టే ఇంటింటి సర్వేలో భాగంగా నకిలీ ఓట్లు తొలగింపు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి సవరణలు చేపడతారు. సవరించిన గడువులను కచ్చితంగా పాటించాలని ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

# కాంగ్రెస్ వల్లే 'పోక్సో' బెయిల్

మొదటి పేజీ తరువాయి

బెయిల్‌ను వ్యతిరేకించినట్లు ఉందని ప్రవీణ్ కుమార్ చెప్పారు. కానీ, అసలు ఆ బాలికకు అన్నే లేదని, కేవలం ఒక అక్క మాత్రమే ఉందని పేర్కొంటూ.. లేని అన్న వచ్చి బెయిల్ వద్దని ఎలా చెబుతాడని ప్రశ్నించారు. పోక్సో రూల్స్ 2020 ప్రకారం నిందితుడు బెయిల్‌కు దరఖాస్తు చేసుకుంటే బాధితులకు నోటీసు ఇవ్వాలి. కానీ ఇక్కడ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న వ్యక్తి కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ బిక్షపతి గౌడ్ అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకుడి వల్లే షాబాద్ పోక్సో నిందితుడు రాజ్ కుమార్‌కు బెయిల్ వచ్చిందని, ఇలాంటి వారికి పీపీ పోస్టులు ఇస్తే మహిళలకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చడానికి వెళుతున్న తమను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని, ఇదే ఉత్సాహం నిందితులను అరెస్ట్ చేయడంలో ఎందుకు చూపించడం లేదని నిలదీశారు.

# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో సిలిండర్ డెలివరీ

మొదటి పేజీ తరువాయి

చేరుతుంది. తొలిదశలో భాగంగా బుధవారం బెంగళూరులో ఈ సేవలను ప్రారంభించారు. వినియోగదారులు ఇకపై స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ యాప్ ద్వారా నేరుగా గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవచ్చు. ఇందులో భాగంగా హెచ్‌పీసీఎల్‌కు చెందిన 10 కేజీల కంపోజిట్ సిలిండర్ (హెచ్‌పీ నవ్య)తో పాటు, 5 కేజీల సాధారణ మెటల్ సిలిండర్ అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా 'హెచ్‌పీ నవ్య' సిలిండర్ పారదర్శకంగా ఉండటం వల్ల గ్యాస్ స్థాయిని సులభంగా చూసుకోవచ్చు. అయితే, ఈ సేవను పొందేందుకు వినియోగదారులకు ముందే గ్యాస్ కనెక్షన్ ఉండాలన్న నిబంధన ఏమీ లేకపోవడం విశేషం. భద్రతా ప్రమాణాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, ఈ డెలివరీలను స్విగ్గీ సాధారణ సిబ్బంది కాకుండా హెచ్‌పీసీఎల్ అధీకృత డిస్ట్రిబ్యూటర్ల ద్వారా నిర్వహిస్తారు. తొలిసారి ఆర్డర్ ఇచ్చే వినియోగదారుల గుర్తింపు కార్డులను పరిశీలిస్తారు. ఆ తదుపరి ఆర్డర్ల నుంచి పాత సిలిండర్ ఇచ్చి కొత్తది తీసుకునే (ఎక్స్ఛేంజ్) విధానంలో డెలివరీ కొనసాగుతుంది. ఈ భాగస్వామ్యం ద్వారా నిత్యావసర సేవలను మరింత సులభతరం చేస్తున్నామని, భద్రత విషయంలో రాజీ పడబోమని ఇన్‌స్టామార్ట్ సీఈఓ అమితేష్ ఝా వెల్లడించారు.

# బ్యాంకుల సేవా లోపాలకు రూ.33 లక్షల పరిహారం

మొదటి పేజీ తరువాయి

ఈ కొత్త విధానం పనిచేస్తుంది. బ్యాంకులు, కొన్ని నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు), క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు, ప్రీపెయిడ్ పేమెంట్ సాధనాల జారీదారులు, ఇతర ఆర్‌బీఐ నియంత్రిత సంస్థలపై వినియోగదారులు తమ ఫిర్యాదులను పరిష్కరించుకోవడానికి ఈ పథకం ఒక ఉచిత, స్వతంత్ర వేదికగా ఉపయోగపడుతుంది. వినియోగదారుడు మొదట తన సమస్యపై సంబంధిత బ్యాంకు లేదా ఆర్థిక సంస్థకు ఫిర్యాదు చేయాలి. నిర్దేశిత గడువులోగా వారి నుంచి స్పందన రాకపోయినా, వారు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందకపోయినా లేదా ఫిర్యాదును తిరస్కరించినా, అప్పుడు మాత్రమే ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించాలి. ఈ పథకం కింద సేవా లోపం వల్ల రుజువైన ఆర్థిక నష్టానికి గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పరిహారం లభించే అవకాశం ఉంది. దీనికి అదనంగా, ఫిర్యాదు చేయడానికి వెచ్చించిన సమయం, ఖర్చులు, ఎదుర్కొన్న మానసిక వేదనకు గాను మరో రూ.3 లక్షల వరకు పరిహారం మంజూరు చేసే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. దీంతో మొత్తం పరిహారం రూ.33 లక్షలకు చేరుతుంది.

# దేవదేవుడు.. కదిలొస్తున్నాడు!

మొదటి పేజీ తరువాయి

క్రాస్ రోడ్స్, హిమాయత్‌నగర్, లిబర్టీ, బషీర్‌బాగ్, అబిడ్స్, ఎంజే మార్కెట్, గాంధీభవన్ మెట్రోస్టేషన్ మీదుగా సాయంత్రం 6 గంటలకు ఎగ్జిబిషన్ మైదానంలో ముగుస్తుందని వివరించారు. లక్ష మంది భక్తులకు సరిపడా ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రథయాత్రను విజయవంతం చేయాలని శంభు వైష్ణవ దాస్ కోరారు.

# అమెరికాలో 'ట్రంప్' కాయిన్

మొదటి పేజీ తరువాయి

ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ బుధవారం వెల్లడించారు. ఈ నాణేనికి ఒకవైపు ట్రంప్ చిత్రం ఉండగా, దానిపై "లిబర్టీ", దిగువన "1776-2026" అనే సంవత్సరాలను ముద్రించారు. చిత్రానికి పక్కన "ఇన్ గాడ్ వుయ్ ట్రస్ట్" అని వాక్యం ఉంటుంది. నాణేనికి రెండో వైపు రెక్కలు విప్పిన గద్ద, దాని మధ్యలో 250వ సంఖ్యతో కూడిన రక్షణ కవచం (షీల్డ్) ఉంటుంది. దానిపై "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా", "వన్ డాలర్" అనే అక్షరాలు ఉంటాయి. ఈ సందర్భంగా స్కాట్ బెస్సెంట్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "అమెరికా 250 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల వేళ, స్వేచ్ఛకు, దేశభక్తికి చిహ్నంగా ఈ కొత్త బంగారు నాణేన్ని యూఎస్ మింట్ ముద్రించనుంది. ట్రంప్ చిత్రంతో కూడిన ఈ నాణెం అమెరికా విలు వలను, స్వేచ్ఛను పరిరక్షిస్తామన్న నిబద్ధతను చాటుతుంది" అని పేర్కొన్నారు.



## మార్కెట్లకు స్వల్ప లాభాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఒడుదొడుకుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవల రంగ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. మెటల్, ఐటీ, రియాల్టీ రంగాల షేర్లలో నష్టాలు కనిపించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 130.49 పాయింట్లు పెరిగి 77,185.43 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 26.45 పాయింట్లు లాభపడి 24,074.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీ-50 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్స్, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, శ్రీరామ్ ఫైనాన్స్, ఐషర్ మోటార్స్ లాభాల్లో ముగిశాయి. హిందాల్కో, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ దాదాపు 1 శాతం పెరిగి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు నిఫ్టీ మెటల్ సూచీ 1 శాతానికి పైగా పడిపోయి అత్యధిక నష్టాలు నమోదు చేసింది. ఐటీ, రియాల్టీ, ఎఫ్ఎంసీజీ షేర్లు కూడా ఒత్తిడిలో కొనసాగాయి. అయితే ఫార్మా రంగం వరుసగా రెండో రోజు లాభపడగా, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ గత రెండు సెషన్ల నష్టాల నుంచి కోలుకుంది. మార్కెట్ నిపుణుల ప్రకారం 24,000 స్థాయి వద్ద బలమైన కొనుగోళ్లు రావడంతో నిఫ్టీ ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి కోలుకుంది. ఈ స్థాయి భవిష్యత్‌లో కీలక మద్దతుగా ఉండనుందని, అంతర్జాతీయ పరిణామాలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, కమోడిటీ ధరలు మార్కెట్ దిశను ప్రభావితం చేసే అంశాలుగా ఉంటాయని వారు పేర్కొన్నారు.

## అయోధ్య సీఈఓ పోస్టుకు వెయ్యి దరఖాస్తులు

అయోధ్య: అయోధ్య రామమందిరం నిర్వహణ కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నూతనంగా ప్రకటించిన ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పోస్టుకు అనూహ్య స్పందన లభిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన రెండు రోజుల్లో వెయ్యికి పైగా దరఖాస్తులు ట్రస్టుకు అందడం విశేషం. ఆలయ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలను మరింత క్రమబద్ధీకరించి, వృత్తిపరమైన ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఈ సీఈఓ పదవిని సృష్టించింది. దీని కోసం జులై 13వ తేదీన దరఖాస్తులను ఆహ్వానించగా, అభ్యర్థులలో అత్యధికులు విశ్రాంత బ్యూరోక్రాట్లు, మాజీ సీనియర్ పరిపాలనాధికారులు ఉండటం గమనార్హం. జూలై 18 సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉన్నందున, దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన నిమిత్తం ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఎంపిక కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఈ పరిశీలన ప్రక్రియ జులై 19 నుంచి ప్రారంభం కానుంది. గడువు ముగిసిన వెంటనే షార్ట్‌లిస్ట్ చేయడం, ఇంటర్వ్యూల నిర్వహణ వంటి ప్రక్రియలు చేపడతారు. జూలై 22న జరగనున్న ట్రస్ట్ సమావేశంలో సీఈఓ నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆలయ విరాళాల దారిమళ్లింపునకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ కొనసాగుతున్న తరుణంలో ఈ నియామక ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేసులో ఇప్పటికే కొందరు సిబ్బందిని అరెస్ట్ చేయగా, ఉత్తరప్రదేశ్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరుపుతోంది. ఈ క్రమంలోనే ఆలయ కార్యకలాపాల్లో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడామే లక్ష్యంగా సీఈఓను నియమిస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ కూడా ఈ పదవికి దరఖాస్తు చేసినట్లు బహిరంగంగా ప్రకటించారు. ఎంపికైన సీఈవో పనితీరు ఆధారంగా ఆ తర్వాత పొడిగింపు ఉంటుంది. ట్రస్ట్ నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయడం, ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించడం మరియు ఆలయ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటం వంటివి నూతన సీఈఓ ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి.

## ఆరేళ్ల కనిష్ఠానికి పతంజలి ఫుడ్స్ షేర్లు

ముంబై: పతంజలి ఫుడ్స్ షేర్లు బుధవారం ఒక్కసారిగా 20 శాతం వరకు పతనమై పెట్టుబడిదారులకు భారీ షాక్ ఇచ్చాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో షేరు ధర రూ.328.20కు పడిపోయి, 2020 ఏప్రిల్ తర్వాత కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అనంతరం కొంత కోలుకున్నప్పటికీ, మధ్యాహ్న ట్రేడింగ్‌లో కూడా సుమారు 16 శాతం నష్టంతో రూ.345 వద్ద కొనసాగింది. ఈ ఆకస్మిక పతనంపై స్పందించిన కంపెనీ, షేర్ ధర ఇంతగా పడిపోవడానికి కారణమయ్యే ఎలాంటి కీలక పరిణామాలు లేదా ప్రకటించాల్సిన సమాచారం తమ వద్ద లేదని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు స్పష్టం చేసింది. కంపెనీ సాధారణంగా తన వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తోందని, లక్ష్యాలను చేరుకునే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొంది. సెబీ లిస్టింగ్ నిబంధనల ప్రకారం బహిర్గతం చేయాల్సిన ఎలాంటి ముఖ్యమైన సమాచారం ప్రస్తుతం లేదని యాజమాన్యం తెలిపింది.



## పాలమూరుకు 90 టీఎంసీల అనుమతులు!

### త్వరలోనే శుభవార్త అందుతుంది: రేవంత్ రెడ్డి



మహబూబ్‌నగర్, జూలై 15 (ఈవార్తలు): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి త్వరలోనే శుభవార్త వింటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో 'అమర రాజా గ్రూప్' నెలకొల్పిన తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒప్పించి, అవసరమైన అనుమతులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని ప్రకటించారు. అదేవిధంగా, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కృష్ణా బేసిన్ పరిధిలోని దిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యతను తాను స్వీకరిస్తానని సీఎం హామీ ఇచ్చారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నిలిపి, ఒక ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపన కోసం భూములిచ్చిన రైతులకు తగిన న్యాయం జరగాలని, అలాగే స్థానిక యువతకే గరిష్ట స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలని యాజమాన్యానికి సూచించారు. అంతకుముందు, అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన 'కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్' తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పర్యావరణ మార్పుల నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని, ఈ తరుణంలో బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఇక్కడ స్థాపించడం ముదావాహమని పేర్కొన్నారు. స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి కల్పిస్తున్న అమర రాజా సంస్థ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికను రూపొందించామని, పారిశ్రామిక విధానాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చామని సీఎం వివరించారు. అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడుతూ అమరరాజా గ్రూప్ దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ఆయన ప్రశంసించారు.

## రండి.. చట్టాన్ని ఢీకొట్టండి

### షేక్ హసీనా రాకపై బంగ్లాదేశ్ సర్కార్ స్పందన



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మళ్లీ స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలపై అక్కడి ప్రస్తుత ప్రభుత్వం అత్యంత దూకుడుగా స్పందించింది. ఆమె ఢాకాకు రావాలనుకోవడాన్ని తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని పేర్కొంటూనే.. దేశద్రోహం, మానవ హక్కుల ఉల్లంఘన కేసుల్లో మరణశిక్ష పడిన నేరస్థురాలిగా ఆమె చట్టాన్ని ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. 2024 ఆగస్టులో జరిగిన ప్రజా తిరుగుబాటుతో బంగ్లాదేశ్‌ను వదిలి పారిపోయిన షేక్ హసీనా... ప్రస్తుతం భారత్ లో తలదాచుకుంటున్నారు. అయితే, ఈ ఏడాది చివరినాటికి ఆమె స్వచ్ఛందంగా ఢాకాకు చేరుకుని, తన 'అవామీ లీగ్' పార్టీని మళ్లీ బతికించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. హసీనా రాకపై బంగ్లాదేశ్ ప్రధానమంత్రి తారిఖ్ రెహమాన్ సలహాదారు జాహెద్ ఉర్ రెహమాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024 నాటి విద్యార్థుల ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసి, వందల మంది ప్రాణాలు తీసిన నేరాలపై హసీనా కోర్టులో పోరాడాలని ఆయన అన్నారు. దేశ ప్రజలంతా ఆమెకు పడిన మరణశిక్ష అమలు కావాలని కోరుకుంటున్నారని, ఆమె వస్తే న్యాయం జరుగుతుందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ లో జరిగే ఈ విచారణ అంతా పారదర్శకంగా ఉంటుందని, ప్రపంచ దేశాల పరిశీలకులు దీనిని గమనించవచ్చని చెప్పారు. ఒకవేళ కోర్టు ఆమెను నిర్దోషిగా ప్రకటిస్తే దానికి కూడా తాము సిద్ధమేనని, హసీనా రాకపై ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. గత ఏడాది నవంబర్‌లో ఢాకాలోని ప్రత్యేక ట్రైబ్యునల్... విద్యార్థుల నిరసనల అణచివేత కేసులో హసీనాకు ఆమె లేని సమయంలోనే మరణశిక్ష విధించింది. అయితే ఈ కేసులన్నీ రాజకీయ కక్షసాధింపు చర్యలేనని హసీనా కొట్టిపారేస్తున్నారు. అప్పటినుంచి ఆమెను తమకు అప్పగించాలంటూ బంగ్లాదేశ్ భారత్‌ను కోరుతోంది. హసీనా తాజా ప్రణాళికలపై భారత విదేశాంగ శాఖ అత్యంత జాగ్రత్తగా స్పందించింది. భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. "ఈ విషయంలో మా విధానంలో ఎలాంటి మార్పు లేదు. నేరస్థుల అప్పగింత అనేది పూర్తిగా ఒక చట్టపరమైన ప్రక్రియ. దాని ప్రకారం ఏది జరగాల్సి ఉంటే అది చట్టబద్ధంగానే జరుగుతుంది" అని చెప్పారు.

## రైతులు ప్రత్యామ్నాయం చూసుకోవాలి

### ఎల్‌నినో ప్రభావంతో నష్టం తప్పదు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హితవు



హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావంతో రైతన్నలు కొంత నష్టపోతున్నారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అనుకున్న సమయానికి వర్షాలు లేకపోవడం వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. దానికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల వైపు వెళ్తే బాగుటుందని సూచించారు. గురువారం నుంచి ఆగస్టు రెండో వారంలోగా ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఆయా జిల్లాల వారీగా వివరాలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. ఈ పంటల కోసం అన్నదాతలకు తమ ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాన్ని ఇంకా నిర్ణయించలేదని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటమే తమ కర్తవ్యమని తెలిపారు. కంది, సోయాబీన్, పెసర, మినుము, జొన్న, సజ్జ సాగుకు రైతులు సిద్ధపడాలని సూచించారు. వర్షాల మీద ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సరికాదని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు, ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షపాతం తగ్గుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది.


మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## ప్రభుత్వ లాంఛనాలు వద్దు

### ముద్రగడ కుటుంబం సంచలన నిర్ణయం

కాకినాడ, జూలై 15 (ఈవార్తలు:) కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం (73) అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలన్న ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను ఆయన కుటుంబ సభ్యులు తిరస్కరించారు. బతికున్నప్పుడు ఆయన్ను అనేక విధాలుగా అవమానించారని, ఇప్పుడు అధికారిక గౌరవాలు, సానుభూతి తమకు అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ముద్రగడ పద్మనాభం మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అయితే, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ముద్రగడ కుటుంబం సున్నితంగా తిరస్కరించింది. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో వైసీపీ నేత జక్కంపూడి రాజా మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. "ముద్రగడ గారు బతికున్నప్పుడు ఆయన్ను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు. ఇప్పుడు మరణించాక మొసలి కన్నీరు కార్చాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ లాంఛనాలు వద్దని ఆయన కుటుంబ సభ్యులు తేల్చిచెప్పారు" అని రాజా తెలిపారు. ముద్రగడ అధికారం కోసం కాకుండా ప్రజా సమస్యల కోసం పోరాడిన గొప్ప నాయకుడని ఆయన కొనియాడారు. దీంతో, ప్రభుత్వ లాంఛనాలు లేకుండానే కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ముద్రగడ అంతిమ సంస్కారాలు జరగనున్నాయి.

## బంజారాహిల్స్ తాజ్ హోటల్ కూల్చివేత

### ఆ ప్లేస్‌లో 40 అంతస్తుల భారీ భవనం

### 315 కోట్లకు దక్కించుకున్న అరబిందో రియాల్టీ



హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): హైదరాబాద్ నగర చిహ్నంగా నిలిచిన బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా హోటల్ ఇక చరిత్రలో కలిసిపోనుంది. నగర ఆతిథ్య రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఈ హోటల్ కూల్చివేత పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. ఈ స్థలంలో సుమారు 40 అంతస్తుల భారీ నివాస సముదాయాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బంజారా లేక్‌ను ఆనుకుని ఉన్న 3.4 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ఆస్తిని అరబిందో రియాల్టీ సంస్థ రూ.315 కోట్లకు దక్కించుకుంది. 2023లోనే హోటల్ కార్యకలాపాలు నిలిచిపోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరులో కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో నాలుగు నెలల సమయం పట్టవచ్చని అంచనా. 1979లో ఏర్పాటైన తాజ్ బంజారా, నగరంలోని తొలి విలాసవంతమైన హోటళ్లలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. సినీ ప్రముఖులకు, పారిశ్రామికవేత్తలకు ఇది దశాబ్దాల పాటు ఇష్టమైన వేదికగా నిలిచింది. 1986 వరకు ఐటీసీ గ్రూప్ నిర్వహణలో ఉండగా, ఆ తర్వాత సుమారు నాలుగు దశాబ్దాల పాటు తాజ్ జీవీకే హోటల్స్ దీన్ని విజయవంతంగా నడిపించింది. అయితే, ఆస్తిపన్ను బకాయిల కారణంగా జీహెచ్ఎంసీ అధికారులు ఈ హోటల్‌ను తాత్కాలికంగా సీల్ చేశారు. సుమారు రూ.1.43 కోట్ల బకాయిలతో పాటు ఇతర కారణాల వల్ల ఇది మూసివేతకు దారితీసింది.

## నికార్సయిన నాయకుడు.. డాక్టర్ రఘు



### 20 ఏళ్ల పాటు కాషాయ పార్టీకి విశేష సేవలు.. పార్టీ బలోపేతం కోసం నిరంతర కృషి

### నాయకత్వ తీరుతో తీవ్ర మనస్తాపం.. 'తెలంగాణ రక్షణ సేన'వైపు అడుగులు.. ఈ నెల 19న కవిత సమక్షంలో చేరిక!

(ఈవార్తలు - జగిత్యాల పొలిటికల్ బ్యూరో)

పదవుల కోసం కాదు.. సిద్ధాంతాన్ని నమ్మిన నాయకుడు ఆయన. రెండు దశాబ్దాల పాటు ఒకే పార్టీకి సర్వస్వాన్ని ధారపోశారు. కార్యకర్తలకు అండగా నిలబడుతూ, అధిష్ఠానమే శిరోధార్యంగా పనిచేశారు. కానీ, బీజేపీ నాయకత్వం తీరు ఆయనను, పార్టీ కేడర్‌ను తీవ్రంగా గాయపర్చింది. దీంతో ఇక చాలు అనుకొని.. తీవ్ర మనస్తాపంతో పార్టీ నుంచి వైదొలిగారు. ఆయనే.. భారతీయ జనతా పార్టీకి 20 సంవత్సరాల పాటు సేవలందించిన సీనియర్ నాయకుడు డాక్టర్ చిట్నేని రఘు. రఘు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ తీసుకున్న నిర్ణయం బీజేపీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అయితే, ఆయన తీసుకున్న మరో నిర్ణయం రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. కల్వకుంట్ల కవిత పార్టీ.. 'తెలంగాణ రక్షణ సేన'లో చేరబోతున్నట్లు చేసిన ప్రకటన, ఎంతో మంది ఆశావహులకు వేదికగా మారింది. ఇప్పటికే మేధావి వర్గం 'టీఆర్ఎస్' దారిపట్టగా, ఇప్పుడు డాక్టర్ రఘు లాంటి విద్యావంతుడు, సమాజ సేవకుడు కవిత పార్టీలో చేరబోతుండటంతో అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు.

#### అంకితభావానికి అవమానాలు

'పదవుల కోసం నేను రాజకీయాల్లోకి రాలేదు. పార్టీ సిద్ధాంతాలను విశ్వసించి పనిచేశాను. నా వెంట నడిచిన ప్రతి కార్యకర్తకు అండగా నిలిచాను. కానీ చివరకు నిబద్ధతకు విలువ లేకుండా పోయింది' అని డాక్టర్ రఘు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఎంపీ ధర్మపురి అరవింద్ నాయకత్వంపైనా విమర్శలు గుప్పించారు. స్థానికంగా పార్టీ కోసం కష్టపడిన నాయకులను ప్రోత్సహించకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఎన్నేళ్లుగా పార్టీ కోసం శ్రమించిన వారికి కనీస గుర్తింపు కూడా ఇవ్వలేదని విమర్శించారు. స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయకుండా కొందరినే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పార్టీ కేడర్‌లో తీవ్ర నిరుత్సాహం నెలకొందని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో కష్టపడే కార్యకర్తల మనోభావాలను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అయితే, కవిత నినాదం 'పాంచజన్యం' తనను విశేషంగా ఆకర్షించిందని, అందుకే తాను ఈ నెల 19న టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోబోతున్నానని ప్రకటించారు. కోరుట్లలోని కావేరీ గార్డెన్స్‌లో జరిగే పాంచజన్య సంకల్ప సభలో కవిత సమక్షంలో పార్టీలో చేరుతానని వెల్లడించారు.



# బొగ్గుబాయి.. సర్కారుతో లడాయి

**అవును ! గతంలో తప్పు జరిగింది.. సారీ. ఇక ముందు అలా ఉండబోదు.**

- ఒక రాజకీయ నాయకుడు/నాయకురాలు ఇంత ఓపెన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం రాజకీయాల్లో అరుదు. కానీ, కవిత ఓ సరికొత్త రాజకీయానికి తెరతీశారు. అదీ.. ఆమె మార్కు రాజకీయం.

ఏప్రిల్ 25, 2026.. ఈ రోజు తెలంగాణ రాజకీయాల్లో మహిళాశక్తి రూఢీ అయిన రోజు. 'తెలంగాణ'పై కుట్రలను పటాపంచలు చేసేందుకు కవిత 'అమ్మ'గా అవతరించిన రోజు. ఆ రోజు నుంచి ఇప్పటిదాకా, కల్వకుంట్ల కవిత లేవనెత్తిన ప్రతి అంశం.. ప్రజా సమస్యే. పార్టీ పెట్టి 3 నెలలు కూడా గడవకముందే, ప్రజల్లో ఆమె ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.

కవిత ఓ సమస్యను లేవనెత్తారంటే, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిందే; లేకపో తే బొక్కబోర్లా పడతాం అని సర్కారు భయపడుతోందంటేనే అర్థం చేసుకోవచ్చు.. కవిత పోరాట పటిమ ఏపాటిదో. రైతుల సమస్యలు మొదలుకొని సింగరేణి 'బొగ్గుబాయి' వరకు ఆమె గళం.. ప్రభంజనం అయ్యింది. కరెక్టుగా చెప్పాలంటే.. 'కవిత ఓ సమస్యను లేవ-నెత్తితే, పెంట పెంట అయిపోద్ది!' అని ప్రభుత్వ పెద్దలు భయపడి సమస్యల వద్దకు పరుగులు తీసిన సందర్భాలు ఈ మూడ్నెల్లలోనే అనేకం.

## కల్వకుంట్ల కవిత సింగరేణి బాట సక్సెస్.. కార్మిక వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు

### దూకుడుతో అధికార, ప్రతిపక్షాలు అమోమయం.. 3 నెలల్లోనే సర్కారుకు 3 చెరువుల నీళ్లు

### ఎప్పుడేం టాపిక్ తీస్తారోనని కళ్లలో వత్తులు.. టీఆర్ఎస్ చీఫ్ కేంద్రంగానే రాష్ట్ర రాజకీయాలు

(ఈవార్తలుస్పెషల్ డెస్క్)

ఇక, అన్నింటికీ మించి సింగరేణి సమస్యలపై ఆమె చేస్తున్న రాజీలేని పోరాటం కార్మికుల్లో కొత్త ఆశను నింపింది. సింగరేణి జాతీయ కార్మిక సంఘం హెచ్ఎంఎస్ గౌరవాధ్యక్షురాలిగా.. సింగరేణి మెడికల్ బోర్డు ఏర్పాటు, డిపెండెంట్ ఉద్యోగాల సమస్యపై పోరాటంతో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. సింగరేణి బెల్ట్ మొత్తం ఆమె పర్యటించిన చోటల్లా సర్కారు సృష్టించిన అడ్డంకులు తక్కువేం కాదు. గొలుసులతో బంధించాలని ప్రయత్నించినా, డ్రమ్ములు పెట్టి అడ్డుకోవాలని చూసినా.. మడమ తిప్పలేదు. బ్లడ్ అలాంటిది మరి. ఒకానొక సందర్భంలో సత్తుపల్లిలో ఆమెను అడ్డుకొనేందుకు పోలీసులు కొత్త గొలుసులను తెప్పించినట్లు తెలిసింది. మరోవైపు అధికార పార్టీ అనుచరులు, స్థానిక ప్రజాప్రతినిధుల మద్దతుదారులు ఆమె పర్యటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీంతో సత్తుపల్లి కేంద్రంగా రాజకీయ ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. కవిత తనను సింగరేణి గౌరవాధ్యక్షురాలిగా పేర్కొంటూ నిర్వహించిన ఈ పర్యటనలో బొగ్గు గనుల భవిష్యత్తు, కార్మికుల సంక్షేమం, ప్రైవేటీకరణ భయాలు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిందని పేర్కొంటూ, బొగ్గు గనులను కాపాడటం ప్రతి తెలంగాణవాడి బాధ్యత అని కవిత అన్నారు. ఇటీవల సింగరేణి కార్యకలాపాలు, బొగ్గు బ్లాకుల కేటాయింపులు, ఓపెన్‌కాస్ట్ గనుల విస్తరణ, కార్మికుల ఉద్యోగ భద్రత వంటి అంశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో 'బొగ్గుబాయి' పేరుతో ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆమె వివరించారు. ఈ పర్యటనలో భాగంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు, రైతులు, నిర్వాసితులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నారు. సత్తుపల్లిలో కవిత పర్యటన ప్రారంభమైనప్పటి నుంచే రాజకీయ ఉద్రిక్తత కనిపించింది. ఆమె కాన్వాయ్‌కు వ్యతిరేకంగా కొందరు నినాదాలు చేశారు. అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుల మద్దతుదారులు నల్లజెండాలు ప్రదర్శించారు. అయితే, సభలో మాట్లాడిన కవిత, సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని, తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలకమైన పాత్ర పోషించిన సంస్థ అని పేర్కొన్నారు. 'సింగరేణిని బలహీనపరిచే ఎలాంటి నిర్ణయాన్నీ తెలంగాణ ప్రజలు అంగీకరించరు. బొగ్గు గనులు, కార్మికుల హక్కులు, ఉద్యోగాల పరిరక్షణ కోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం' అని ఆమె ప్రకటించారు. దెబ్బకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మానికి కదిలి రాక తప్పలేదు. కేంద్ర పెద్దలు కూడా ఎప్పుడూలేనంతగా బొగ్గు బ్లాక్‌ల కేటాయింపుపై క్రెడిట్ కోసం తాపత్రయపడుతున్నారు. బీజేపీ 'సింగరేణి భరోసా యాత్ర' పేరుతో కార్మికుల్లో సింపతీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికంతటికీ కారణం.. కవితే. 'వెలుగుమట్ల' ఘటనలోనూ అంతే. కవిత ఆ సమస్యపై గళం విప్పగానే, గొంతు తడారినట్లు సర్కారోళ్లు పరుగో పరుగు అంటూ 'వెలుగుమట్ల' డ్యామేజీ కంట్రోల్‌కు విశ్వప్రయత్నాలు చేశారు. ఇలా, చెప్పుకుంటూ పోతే.. ఆమె ప్రతి పర్యటన ఓ సందర్భం, పాదయాత్ర ఓ సంచలనం.

> తెలంగాణ యాస, భాష..రాష్ట్ర హక్కులు, నిధులు..
> సాగునీరు, వ్యవసాయం.. ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపులు..
> కులగణన, బీసీ రిజర్వేషన్లు.. నిత్యావసర ధరలు, పెట్రో ధరలు..
> రేషన్ వ్యవస్థ, నిరుద్యోగ సమస్య.. దళిత, గిరిజన సంక్షేమం, చేనేత..
> బొగ్గుగనుల ప్రైవేటీకరణ, సింగరేణి ఉద్యోగుల భద్రత.. ఇలా..
> ప్రతీ సమస్యపై ఆమెది పోరాటతత్వమే.. ప్రతీ అంశంపై ఆమెది పిడికిలిపథమే..
> **తెలంగాణ ఫస్ట్.. ఆమె నినాదం! పాంచజన్యం.. ఆమె లక్ష్యం!!**

**'బొగ్గుబాయి'** పర్యటనను రాజకీయ విశ్లేషకులు సైతం తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాల కోణంలో చూస్తున్నారు. సింగరేణి కార్మికులు, బొగ్గు గని ప్రాంతాల ప్రజలను ఆకర్షించే ప్రయత్నంగా ఈ కార్యక్రమాన్ని అభివర్ణిస్తున్నారు. మరోవైపు సత్తుపల్లిలో ఎదురైన ప్రతిఘటన ఈ అంశం రాజకీయంగా ఎంత సున్నితంగా మారిందో సూచిస్తోందని విశ్లేషిస్తున్నారు. సింగరేణి అంశం తెలంగాణ రాజకీయాల్లో ఎప్పటికప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంటూ వచ్చిన నేపథ్యంలో, కవిత చేపట్టిన ఈ పర్యటన భవిష్యత్తులో మరిన్ని రాజకీయ చర్చలకు దారితీసే అవకాశముందని భావిస్తున్నారు. 'బొగ్గుబాయి' పర్యటనను సింగరేణి పరిధిలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించనున్నట్లు కవిత ప్రకటించారు. కార్మికులు, నిర్వాసితులు, రైతులు, స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని కూడా వెల్లడించారు. పైగా, ఈ నెల 20న పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఈ నెల 20న నిరవధిక నిరాహార దీక్షకు సిద్ధమయ్యారు. సింగరేణి కార్మికుల మెడికల్ బోర్డు ఏర్పాటు, డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలపై ఈ దీక్ష చేపట్టనున్నారు. మెడికల్ బోర్డు కోసం దరఖాస్తు చేసుకున్న 1,200 మంది కార్మికులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఆ దీక్ష.. పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేస్తోంది. కవిత ఏ సమస్యపై పోరాటం చేస్తారో తెలుసుకోవడానికి ప్రభుత్వ పాలకులు ప్రత్యేకంగా ఓ నిఘా విభాగాన్నే ఏర్పాటు చేసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆమె కార్యాలయం చుట్టూ డేగ కన్నుతో సమీక్షిస్తున్నట్లు, ఎప్పటికప్పుడు రిపోర్టులు తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా.. 'తెలంగాణ రక్షణసేన చీఫ్' చుట్టూనే రాష్ట్ర రాజకీయాలు తిరుగుతున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## 23 నియోజకవర్గ ఇన్‌చార్జీల నియామకం!

రాష్ట్రంలోని 23 అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జీలను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు. తొలి విడతలో ఈ నియామకాలను ప్రకటించిన పార్టీ అధిష్ఠానం, మిగతా నియోజకవర్గాలకు కూడా దశలవారీగా ఇన్‌చార్జీలను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, పార్టీ చీఫ్‌కు అదృష్ట సంఖ్యగా భావించే 5కు అనుగుణంగా మొత్తం 23 మంది ఇన్‌చార్జీలను ప్రకటించినట్లు తెలిపారు. ఆషాఢ మాసంలో శుభ ముహూర్తాన్ని పురస్కరించుకుని ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మజీద్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కవితక్క ఆశయాల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సేవే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మజీద్, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## శివంగిలా ప్రజా పోరాటాలు

1. సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణ-కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ సింగరేణిని పరిరక్షించాలని డిమాండ్.
2. సింగరేణి కార్మికుల ఉద్యోగ భద్రత-కొత్త నియామకాలు చేపట్టి కార్మికుల హక్కులను కాపాడాలని విజ్ఞప్తి.
3. బొగ్గుబాయి (ఓపెన్‌కాస్ట్) ప్రాజెక్టుల విస్తరణ-గ్రామాల నిర్వాసిత సమస్యలు, పర్యావరణ నష్టం, వ్యవసాయ భూముల కోల్పోవడంపై ఆందోళన.
4. రైతులకు సాగునీటి కొరత-కాళేశ్వరం నీటి వినియోగం, ఆయకట్టు ప్రాంతాలకు నీటి విడుదలపై ప్రశ్నలు.
5. వ్యవసాయ సంక్షోభం-పంటలు ఎండిపోవడం, రైతులకు పరిహారం, రుణమాఫీ అమలు అంశాలు.
6. ధాన్యం కొనుగోలు సమస్యలు-కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలని డిమాండ్.
7. మహిళల భద్రత-మహిళలపై పెరుగుతున్న నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరడం.
8. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం-వడ్డీ రాయితీలు, రుణ సౌకర్యాలు పెంచాలని సూచన.
9. నిరుద్యోగ సమస్య-ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్.
10. తెలంగాణ రాష్ట్ర హక్కులు-రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధులు, ప్రాజెక్టుల అనుమతులపై కేంద్రాన్ని ప్రశ్నించడం.
11. బీసీ రిజర్వేషన్లు-బీసీలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్.
12. కులగణన-సామాజిక న్యాయం కోసం సమగ్ర కులగణన నిర్వహించాలని పిలుపు.
13. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల-పెరిగిన ధరలు సామాన్యులపై భారమవుతున్నాయని విమర్శ.
14. నిత్యావసర వస్తువుల ధరలు-ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపడం.
15. రేషన్ వ్యవస్థ-అర్హులందరికీ రేషన్ కార్డులు, నాణ్యమైన సరుకుల పంపిణీపై డిమాండ్.
16. దళిత, గిరిజన సంక్షేమం-సంక్షేమ పథకాల అమలు, భూ హక్కుల పరిరక్షణపై దృష్టి.
17. చేనేత రంగం-చేనేత కార్మికులకు ఆర్థిక ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి.
18. తెలంగాణ భాష, సంస్కృతి పరిరక్షణ-తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపు.
19. రాజ్యాంగ సంస్థల స్వతంత్రత-ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతం, రాజ్యాంగ విలువల పరిరక్షణపై వ్యాఖ్యలు.

**ప్రజా సమస్యలపై పాదయాత్రలు, పర్యటనలు-సింగరేణి ప్రాంతాలు, రైతు సమస్యలు, గ్రామీణ ఇబ్బందులపై ప్రత్యక్షంగా ప్రజలను కలిసి వారి సమస్యలను వెలుగులోకి తీసుకురావడం. ఈ అంశాల్లో ముఖ్యంగా సింగరేణి పరిరక్షణ, బొగ్గుబాయి (ఓపెన్‌కాస్ట్) ప్రాజెక్టుల వ్యతిరేకత, రైతు సమస్యలు, మహిళా సాధికారత, బీసీ హక్కులు వంటి అంశాలపై కవిత అత్యంత చురుకుగా స్పందిస్తూ రాజకీయ, ప్రజా వేదికలపై ప్రస్తావించడం గమనార్హం.**





## సర్‌పై ప్రజల్లో అవగాహన పెరగాలి: నవీన్ పటేల్

హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాగంటి సునీత గోపీనాథ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నవీన్ పటేల్ యూసఫ్‌గూడ డివిజన్‌లోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో సమావేశమై ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నవీన్ పటేల్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియకు గడువు ఆగస్టు 3 వరకు పొడిగించడం స్వాగతించదగ్గ నిర్ణయమని, ఇందుకు ఎన్నికల కమిషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు చివరి రోజు వరకు వేచి ఉండకుండా ముందుగానే తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. యూసఫ్‌గూడ డివిజన్‌లో ఇప్పటివరకు సుమారు 25 శాతం ఫారాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తైందని తెలిపారు. చాలా మందికి ఈ కార్యక్రమంపై పూర్తి అవగాహన లేకపోవడం, ఫారాలు ఎలా నింపాలో తెలియకపోవడం, సమన్వయ లోపం వంటి కారణాలతో ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ నియమించిన బీఎల్ఏలు సమర్థంగా పనిచేస్తున్నారని, వారి సేవలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ తలారి, షబ్బీర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## తల్లిదండ్రులకు వేధింపులు.. కొడుకులపై కేసు

**ఆర్డీవోకు ఫిర్యాదు.. సంరక్షణ చట్టం కింద నమోదు**

ఎండపెల్లి, జూలై 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండలం ఎండపెల్లి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బొజ్జ భూమయ్య (84), రాజమ్మ (78) తమను పోషించకుండా వేధిస్తున్న కొడుకు, కోడలిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది హరి అశోక్‌కుమార్ సహకారంతో అడ్మినిస్ట్రేటివ్ అధికారి కోట వసంతకు వినతిపత్రం అందజేయగా, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. తమ చిన్న కుమారుడు మహేష్, కోడలు మమత ఇంట్లో ఉంచకుండా వేధిస్తున్నారని, నెలకు రూ.10 వేల భరణం ఇప్పించాలని ఆర్డీవోను కోరినట్లు వృద్ధ దంపతులు తెలిపారు. అనంతరం తమకు సహకరించిన హరి అశోక్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## మెడికల్ కాలేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి

**అధికారులకు ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ ఆదేశం**

జగిత్యాల, జూలై 15 (ఈవార్తలు): ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులు, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యార్థుల బ్యాచ్ రాకకు ముందే హాస్టల్ పనులు పూర్తి చేయాలని, మెడికల్ కాలేజీలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అలాగే పాత బస్టాండ్ ప్రభుత్వ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## జాతీయ బేస్‌బాల్ పోటీల్లో గోవిందారం విద్యార్థిని ప్రతిభ

**చెల్ల నాగమణిని అభినందించిన డీఈఓ రాము**

భీమారం, జూలై 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా భీమారం మండలం గోవిందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని చెల్ల నాగమణి ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు జిల్లా విద్యాధికారి రాము అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించిన ఆయన.. విద్యార్థుల క్రీడా ప్రతిభను మరింత ప్రోత్సహించి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా బేస్‌బాల్ ప్రధాన కార్యదర్శి కొప్పుల గంగాధర్, ప్రధానోపాధ్యాయులు అశ్ఫాక్ హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## పారా తైక్వాండో క్రీడాకారిణి సక్కుబాయికి కలెక్టర్ గరిమ సన్మానం

వేములవాడ అర్బన్/రాజన్న సిరిసిల్ల, జూలై 14 (ఈవార్తలు): మహారాష్ట్రలో జరిగిన 5వ ఇండియా తైక్వాండో ఓపెన్ పారా జాతీయ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన రాజన్న సిరిసిల్ల జిల్లా క్రీడాకారిణి బుక్య సక్కుబాయిని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఘనంగా సన్మానించారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని బంగిరెడ్డి తండాకు చెందిన బుక్య సక్కుబాయి తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించి పుణేలోని శ్రీ శివ ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్, మహాలుంగేలో జూలై 10, 11 తేదీలలో నిర్వహించిన 2026–27 ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. పారా పూంసే పీ72 స్పోర్ట్స్ క్లాస్ విభాగంలో ఆమె కాంస్య పతకం సాధించి రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన క్రీడాకారిణి జాతీయ స్థాయిలో పతకం సాధించడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో సక్కుబాయి మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి తెలంగాణతో పాటు దేశానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రాందాస్ పాల్గొన్నారు.



## మారం ప్రవీణ్‌కు కేఎంఎస్ ఐకాన్ అవార్డు



వేములవాడ అర్బన్, జూలై 15 (ఈవార్తలు): వేములవాడకు చెందిన ప్రముఖ జానపద కళాకారుడు, నటుడు, సీనియర్ కొరియోగ్రాఫర్ మారం ప్రవీణ్ కుమార్ (పప్పి)కు ప్రతిష్ఠాత్మక కేఎంఎస్ ఐకాన్ అవార్డు–2026 వరించింది. 'బెస్ట్ ఫోక్ సాంగ్స్ ఫేమ్ యాక్టర్ అండ్ సీనియర్ కొరియోగ్రాఫర్' విభాగంలో ఆయనను ఎంపిక చేశారు. ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ కళాభారతి ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. అవార్డు ఎంపికపై మారం ప్రవీణ్ హర్షం వ్యక్తం చేస్తూ, తన కళాసేవలను గుర్తించిన మిలీనియం డాన్స్ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు.

# నవజాత శిశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, జూలై 15 (ఈవార్తలు): నవజాత శిశువుల మరణాలను పూర్తిగా నివారించే దిశగా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సంకల్ప్' కార్యక్రమంలో భాగంగా నవజాత శిశువుల మరణాల నివారణ, మాతా–శిశు ఆరోగ్య సంరక్షణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ––ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్య నిపుణులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు నెలల్లో నమోదైన నవజాత శిశువుల మరణాలు, వాటి కారణాలను సవివరంగా పరిశీలించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని ఎస్ఎన్‌సీయూ సేవలపైనా ఆరా తీశారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, జిల్లాలో నవజాత శిశువుల మరణాల శాతం జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్నప్పటికీ, దానిని సున్నాకు చేరేలా కృషి చేయాలని సూచించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా బీపీ, షుగర్, రక్త పరీక్షలు సహా అన్ని అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, వాటి వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. గర్భిణులకు వ్యాయామం, యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీలు జరిగేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలని, హైరిస్క్ గర్భిణులకు మాత్రమే సిజేరియన్ శస్త్రచికిత్సలు చేయాలని స్పష్టం చేశారు.

బాలింతలకు నవజాత శిశువుల సంరక్షణ, తల్లిపాల ప్రాధాన్యం, పుట్టిన గంటలోపే శిశువును తల్లి వద్దకు చేర్చాల్సిన అవసరంపై వైద్యులు అవగాహన కల్పించాలని సూచించారు. నెలలు నిండక ముందే లేదా తక్కువ బరువుతో జన్మించిన శిశువులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు వెలుగులోకి వస్తే సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, డీసీహెచ్ఎస్ రవీందర్, మెడికల్ ఆఫీసర్లు, గైనకాలజిస్టులు, పిల్లల వైద్య నిపుణులు, ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు బాలికల జూనియర్ కాలేజీలో వనమహోత్సవం

జగిత్యాల టౌన్, జూలై 15 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 17న ఇస్కా ఫౌండేషన్–రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో వనమహోత్సవం సందర్భంగా పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి బుధవారం మున్సిపల్ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మీరాజు, ఏసీఎస్ రాజు, ఇస్కా ఫౌండేషన్––రోటరీ క్లబ్ ప్రతినిధులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్‌లు కళాశాల ఆవరణలో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని కౌన్సిలర్ అరవ లక్ష్మీరాజు తెలిపారు.

## ఓటరు సవరణలో భాగస్వాములు కావాలి: దావ వసంత

జగిత్యాల అర్బన్, జూలై 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ బుధవారం జగిత్యాల అర్బన్ మండలం గోపాలరావుపేట గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారంలో తన ఓటరు వివరాలను నమోదు చేసి సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు చేయించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదుకు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.



## సర్‌లో ప్రతి ఓటరు నమోదు కావాలి

**అర్బన్‌లో ప్రత్యేక దృష్టి సారించాలి.. అధికారులకు జీవన్‌రెడ్డి సూచన**

జగిత్యాల టౌన్, జూలై 15 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 3వ వార్డులో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు శ్రీరాములు గంగాధర్, కౌన్సిలర్ ప్రదీప్‌తో కలిసి పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం ఆర్డీఓ, తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడిన జీవన్‌రెడ్డి.. పట్టణ ప్రాంతంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మోతేరోడ్, సౌరాలవాడ, మొండిగట్టు, గోత్రాల కాలనీ, బుడగజంగాల కాలనీ, గోవిందపల్లె ప్రాంతాల్లో ఇతర జిల్లాల నుంచి ఉపాధి కోసం వచ్చి స్థిరపడిన వారు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. వీరంతా ఉదయం పనులకు వెళ్లి సాయంత్రం మాత్రమే అందుబాటులో ఉంటారని, అందువల్ల సంబంధిత బీఎల్‌వోలు సాయంత్రం వేళల్లో కూడా అందుబాటులో ఉండి నమోదు ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్రోల్‌మెంట్ ఫారాలు అందరికీ పంపిణీ చేసినందున వాటిని మ్యాపింగ్ చేసి అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియను అధికారులు ఎంత బాధ్యతగా నిర్వహిస్తున్నారో, రాజకీయ పార్టీగా తాము కూడా అంతే బాధ్యతతో సహకరిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు, కౌన్సిలర్లు, బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

## జీపీ నిధుల మళ్లింపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి


**డీపీఓకు జగిత్యాల నియోజకవర్గ సర్పంచుల వినతి**



జగిత్యాల, జూలై 15 (ఈవార్తలు:) గ్రామపంచాయతీ నిధుల్లో 15 శాతం మొత్తాన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపునకు మళ్లించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జగిత్యాల నియోజకవర్గ సర్పంచులు డిమాండ్ చేశారు. అలాగే కరెంట్ బిల్లుల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, దోమల నివారణ, చెత్త సేకరణ వంటి అత్యవసర సేవలను నిరంతరాయంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కాకపోవడంతో పాటు, గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉండటంతో గ్రామపంచాయతీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామపంచాయతీ నిధుల్లో 15 శాతం మొత్తాన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపునకు మళ్లించడం వల్ల గ్రామాభివృద్ధి పనులు పూర్తిగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి, గ్రామపంచాయతీ నిధులను అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ తదితర అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్ వినతిపత్రాన్ని స్వీకరించి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాజేందర్, సతీష్, గంగన్న, మహేష్, లక్ష్మి–రవి, రవి,కవిత–స్వామిరెడ్డి, ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మ తల్లి బోనాల జాతర

**జగిత్యాలలో భక్తుల సందడి.. వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రత్యేక పూజలు**



జగిత్యాల టౌన్, జూలై 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎలుకబావివాడలో గంగపుత్రుల ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మ తల్లి బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనం నెత్తిన పెట్టుకొని సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యువతీ, యువకులు డీజే వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి హాజరై గంగపుత్ర సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలు గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు పంటలు బాగా పండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్, నాయకులు రాజన్న, నరేష్, రజనీకాంత్, వెంకటి, శంకర్, దేవేందర్, కిరణ్ పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ రహితానికి నడుం బిగించారు!

**శాత్రాజుపల్లి రెడ్డి సంక్షేమ సంఘం నిర్ణయం**

వేములవాడ అర్బన్, జూలై 15 (ఈవార్తలు): ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా శాత్రాజుపల్లి రెడ్డి సంక్షేమ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించే అన్ని శుభకార్యాలు, వివాహాలు, సభలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాల్లో సింగిల్–యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని సంఘం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ వేములవాడ మున్సిపల్ విలీన గ్రామం రెండో వార్డు కౌన్సిలర్ ఏనుగు జ్యోతి, తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు, కవర్లు, క్యారీ బ్యాగుల స్థానంలో కాగితం, ఆకు పాత్రలు, స్టీల్ లేదా ఇతర పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. "ఈ రోజు ప్లాస్టిక్‌ను వదిలితే రేపటి తరాలకు పరిశుభ్రమైన ప్రకృతిని అందించగలం" అని వారు పేర్కొన్నారు. ప్రతి కార్యక్రమాన్ని ప్లాస్టిక్ రహిత వేడుకగా నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. కౌన్సిలర్ ఏనుగు జ్యోతి, తిరుపతి రెడ్డి విజ్ఞప్తికి స్పందించి ఈ నిర్ణయం తీసుకున్న రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొమ్ముల స్వామి రెడ్డి, సంఘ సభ్యులను వారు అభినందించారు. సమాజంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి నిర్ణయాలు ఆదర్శప్రాయంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

## మల్యాల మండలంలో సర్ ప్రక్రియ 68% పూర్తి: ఎమ్మార్వో

మల్యాల, జూలై 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో సమగ్ర సవరణ సర్వే ప్రక్రియ రోజురోజుకి వేగవంతం అవుతుంది. మాల్యాల మండలంలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఓటర్ల ఇంటికి వెళ్లి ఇన్యూమరేషన్ ఫారాలను అందజేసి ఓటర్లే దరఖాస్తు పూర్తి చేసి బీఎల్‌వోకి ఇవ్వాలని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో నిన్నటివరకు 68% ఆన్లైన్ పూర్తయినట్లు మల్యాల మండల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 24 తేదీ వరకు ఈ ప్రక్రియ ఉంటుందని వివరించారు.



## ఘనంగా బండి రమేష్ జన్మదిన వేడుకలు


కూకట్‌పల్లి, జూలై 15 (ఈవార్తలు): కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ జన్మదిన వేడుకలు కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో అపూర్వ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కమ్మ సంఘం నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి వేడుకలను నిర్వహించారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలతో బండి రమేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యకర్తల జైకారాలు, శుభాకాంక్షలతో ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్ ప్రాంగణం సందడిగా మారింది. వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా కమ్మ సంఘం నాయకులు బండి రమేష్‌ను విశిష్టంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా సమాజ అభ్యున్నతి కోసం చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడుతూ శాలువా కప్పి, పూలమాలలు వేసి అభినందించారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ, తనపై చూపుతున్న ప్రేమ, ఆదరణకు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా ప్రజాసేవకు మరింత అంకితమయ్యే సంకల్ప దినంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు అవకాశాల కల్పన, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదానం, కేక్ పంపిణీ, పేదలకు పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

లయ్యారి చిత్రం


అర్షీ చికారా

# నెట్‌ఫ్లిక్స్‌లో పెద్ది జోరు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన అనంతరం, ప్రస్తుతం ఓటీటీ వేదికగా అలరిస్తోంది. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో జూలై 9 నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం, ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు కీలక పాత్రలు పోషించారు. ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 340 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం, 2026 సంవత్సరానికి గాను టాలీవుడ్ టాప్ హిట్స్‌లలో ఒకటిగా నిలిచింది. తన క్రీడా నైపుణ్యంతో ఓ సామాన్య కార్మికుడు తన గ్రామ హక్కుల కోసం సాగించిన పోరాటమే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. డిజిటల్ వేదికపై విడుదలైన కొద్ది రోజుల్లోనే 'పెద్ది' చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో విశేష ఆదరణ పొందుతూ, భారతీయ స్ట్రీమింగ్ ర్యాంకింగ్స్‌లో ఈ సినిమా అగ్రస్థానంలో కొనసాగుతోందని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.








# సెప్టెంబర్ 4కు 'ఇమ్మోర్టల్' వాయిదా

ప్రముఖ సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్, కయాదు లోహర్ జంటగా నటిస్తున్న హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'... నాకు మరణం లేదు అనేది ఈ చిత్రం ట్యాగ్ లైన్. మరియప్పన్ చిన్న దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విడుదల తేదీ మారింది. ముందుగా ప్రకటించిన ప్రకారం జులై 23న రావాల్సిన ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం బుధవారం అధికారికంగా ప్రకటించింది. కోలీవుడ్ స్టార్ హీరో, సీఎం విజయ్ నటించిన భారీ చిత్రం 'జన నాయగన్'. విజయ్ కి ఇదే ఆఖరి చిత్రం. హెచ్. వినోద్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను జులై 23న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో బాక్సాఫీస్ వద్ద పోటీని నివారించేందుకు 'ఇమ్మోర్టల్' మేకర్స్ తమ సినిమా విడుదలను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయంపై జీవీ ప్రకాశ్ తన ఎక్స్ ఖాతాలో ఆసక్తికరంగా స్పందించారు. ""దళపతి వస్తుంటే తప్పుకోవాలి కదా.. అదీ చివరిసారిగా..!' అంటూ 'జన నాయగన్' చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. మీ అందరి ప్రేమ, మద్దతుతో 'ఇమ్మోర్టల్' సెప్టెంబర్ 4న థియేటర్లలోకి వస్తుంది" అని పేర్కొన్నారు. గతంలో విడుదలైన 'ఇమ్మోర్టల్' టీజర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రొమాంటిక్ కామెడీగా మొదలై, ఒక్కసారిగా హారర్ టర్న్ తీసుకోవడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. టీజర్‌లో జీవీ ప్రకాశ్, కయాదు లోహర్ మధ్య సంభాషణలు, ఆ తర్వాత గబ్బిలం ముఖంతో కనిపించే భయంకర రూపం ఉత్కంఠను రేపాయి. ఈ చిత్రంలో టీఎమ్ కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# సెన్సార్ కట్స్ ఓ పెద్ద జోక్: ఆర్జీవీ

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఫిల్మ్ సెన్సార్‌షిప్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సినిమాలకు సెన్సార్ విధించడం అనేది ప్రేక్షకులను అవమానించడమేనని, కాలం చెల్లిన ఈ విధానాన్ని పూర్తిగా నిషేధించాలని ఆయన డిమాండ్ చేశారు. నేడు తన 'ఎక్స్' ఖాతా వేదికగా సెన్సార్‌షిప్ పై ఆయన సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. "స్మార్ట్‌ఫోన్లు, గ్లోబల్ స్ట్రీమింగ్, అపరిమిత సమాచారం అందుబాటులో ఉన్న ఈ యుగంలో, ప్రభుత్వం నియమించిన ఓ కమిటీ (దాని సభ్యుల అర్హతలు ఏమిటి?) పెద్దలైన ప్రేక్షకులను సినిమా నుంచి కాపాడుతుందని నమ్మడం మూర్ఖత్వం" అని వర్మ పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, ఇది ప్రజలను చిన్నపిల్లలుగా చూడటమేనని విమర్శించారు. "దేశ నాయకుడిని ఎన్నుకోవడానికి 18 ఏళ్ల వ్యక్తికి ఓటు వేసే పరిణతి ఉంటుందని నమ్మినప్పుడు, ఏ సినిమా చూడాలో, ఏది చూడకూడదో నిర్ణయించుకునే స్వేచ్ఛ వారికి ఉండదా? ఒక సినిమాలోని సన్నివేశం వారిని పాడు చేస్తుందని ఎలా అనుకుంటారు?" అని ఆయన ప్రశ్నించారు. సెన్సార్ విధానం ఆచరణలో విఫలమైందని వర్మ ఉదాహరణలతో సహా వివరించారు. "థియేటర్లలో విడుదల కోసం ఒక సన్నివేశాన్ని కట్ చేయడం హాస్యాస్పదం. ఎందుకంటే కట్ చేయని వెర్షన్ కొన్ని గంటల్లోనే టొరెంట్లు, టెలిగ్రామ్ వంటి వేదికల్లోకి వచ్చేస్తుంది. దీనికి ఉదాహరణగా 'అబ్సెషన్' చిత్రంలోని తల బాదుకునే సన్నివేశాన్ని చెప్పవచ్చు. సెన్సార్లు దాన్ని కత్తిరించిన తర్వాత, థియేటర్లలో సినిమా చూసిన వారి కంటే ఇన్‌స్టా రీల్స్‌లో పది రెట్లు ఎక్కువ మంది ఆ సన్నివేశాన్ని చూసి ఉంటారు. సెన్సార్ కంటెంట్‌ను దాచిపెట్టదు, దానికి మరింత డిమాండ్ సృష్టిస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు.






# సమీరారెడ్డి ఫ్యామిలీ టాక్స్..!

తన కుమార్తె తనను కోర్టుకు తీసుకెళుతోందని ఓ తల్లిగా ప్రముఖ నటి సమీరా రెడ్డి చెప్పడం సోషల్ మీడియాలో అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే ఇది సీరియస్ విషయం కాదు, కేవలం ఓ సరదా సంఘటన మాత్రమే. ఈ ఊహించని పరిణామం గురించి సమీరా రెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సరదా వీడియోను పంచుకున్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. బుధవారం నాడు సమీరా రెడ్డి పోస్ట్ చేసిన వీడియోలో ఆమె ఇలా మాట్లాడారు, "సాధారణంగా పిల్లలు తమ తల్లిదండ్రులను ఎక్కడికి తీసుకెళ్తారు? పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లకా? ప్రిన్సిపాల్ ఆఫీసుకా? స్కూల్ యాన్యువల్ డే ఫంక్షన్లకా? స్నేహితుల పుట్టినరోజు పార్టీలకైతే తప్పకుండా తీసుకెళతారు. కానీ నా కూతురు నైరా నన్ను ఎక్కడికి తీసుకెళుతోందో తెలుసా? కోర్టుకు! చూడటానికి ఇదొక్కటే మిగిలింది. ఏం జరుగుతుందో చూస్తూ ఉండండి" అని నవ్వుతూ చెప్పారు. "ఇంకా ఏం జరుగుతుందో నమ్మలేకపోతున్నాను" అని ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. సమీరా రెడ్డి, ఆమె భర్త అక్షయ్ వర్దేకు ఇద్దరు పిల్లలు. 2015లో కొడుకు హన్స్, 2019 జులై 12న కూతురు నైరా జన్మించారు. 2014లో వివాహం చేసుకున్న ఈ జంట, తమ కుటుంబానికి సంబంధించిన మధుర క్షణాలను సోషల్ మీడియాలో తరచుగా పంచుకుంటారు. సమీరా రెడ్డి తన మాతృత్వపు అనుభవాలను, ప్రసవానంతర డిప్రెషన్, బరువు సమస్యల వంటి సవాళ్లను ధైర్యంగా చర్చిస్తారు. తల్లులు తమను తాము అంగీకరించాలని, ఆత్మవిశ్వాసంతో ఉండాలని ఆమె ప్రోత్సహిస్తుంటారు.

# 23న 'జన నాయగన్'




తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలపై నెలలుగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడింది. జులై 23న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మేరకు చిత్రబృందం రిలీజ్ పోస్టర్ ను సోషల్ మీడియాలో పంచుకుంది. తమిళనాడులో ఈ సినిమాకు ప్రత్యేకంగా ఉదయం 5 గంటల షోలు ఉ ండవని తెలుస్తోంది. తొలి ప్రదర్శన ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నట్లు సమాచారం. కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మాత్రం ఉదయం 5 గంటల నుంచే షోలు వేయనున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇటీవలే ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) 'ఏ' సర్టిఫికెట్ మంజూరు చేసింది.

# దక్షిణాది ఎదుగుదలను 15 ఏళ్ల క్రితమే ఊహించా: గోవిందా



బాలీవుడ్ నటుడు గోవిందా తన కొత్త చిత్రం 'రూపా'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దక్షిణాది సినిమా ఎదుగుదలను తాను 15 ఏళ్ల క్రితమే ఊహించానని చెప్పారు. తాను ఓ స్నేహితుడితో పదేళ్లలో దక్షిణాది సినిమాలు దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతాయని చెప్పానని గోవిందా తెలిపారు. ఆ తర్వాత ప్రభుదేవా దర్శకత్వంలో వచ్చిన 'వాంటెడ్', అక్షయ్ కుమార్ నటించిన 'రౌడీ రాథోడ్', అజయ్ దేవగణ్ 'దృశ్యం' వంటి దక్షిణాది రీమేక్ చిత్రాలు భారీ విజయాలు సాధించాయని గుర్తు చేశారు. ఈ సినిమాల విజయంతో హీరోలు గొప్ప ఖ్యాతి గడించారని పేర్కొన్నారు.

# సల్మాన్‌కు కుతంత్రాలు తెలియవు



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌పై అందాల భామ పూజా హెగ్డే ప్రశంసలు కురిపించింది. సల్మాన్ చాలా మంచివాడని, అతనికి కుట్రలు, కుతంత్రాలు తెలియవని ప్రశంసించింది. కొంతమంది హీరోలు మాత్రం కుట్రలు పన్నుతుంటారని సంచలన వ్యాఖ్యలు చేసింది చేసింది. కానీ, సల్మాన్ మాత్రం గొప్ప వ్యక్తి అంటూ కొనియాడింది. మనసులో ఏది ఉంటే అది బయటకు చెబుతారని... అలా బయటకు చెప్పడం చాలా కష్టమని వెల్లడించింది. 'అరబిక్ కుతు', 'మోనికా' పాటలు తన ఫేవరెట్ అని తెలిపింది. డాన్స్ చేసేటప్పుడు మ్యూజిక్‌ను ఎంజాయ్ చేయడాన్ని హృతిక్ రోషన్ నుంచి నేర్చుకున్నట్లు వివరించింది. ప్రభాస్ అంటే ఫుడ్ గుర్తుకు వస్తుందని చెప్పింది. సినిమాల విషయానికి వస్తే టాలీవుడ్‌లో పూజకు అవకాశాలు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం ఆమె బాలీవుడ్, కోలీవుడ్‌పై పూర్తిగా ఫోకస్ చేస్తోంది.





# ఫైనల్లో స్పెయిన్

## ఫ్రాన్స్‌ను ఓడించి సంచలనం

'ఫిఫా ప్రపంచ కప్ 2026' లో స్పెయిన్ సంచలనం సృష్టించింది. టోర్నీలో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్‌కు షాకిచ్చి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. టెక్సాస్‌లోని ఏటీ అండ్ టీ స్టేడియంలో బుధవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ 2-0 గోల్స్ తేడాతో ఫ్రాన్స్‌పై ఘన విజయం సాధించింది.

**2010లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత స్పెయిన్ మళ్లీ వరల్డ్ కప్ ఫైనల్‌కు అర్హత సాధించడం ఇదే తొలిసారి. మ్యాచ్ ఆరంభం నుంచే స్పెయిన్ పట్టు బిగించింది. ఆట 22వ నిమిషంలో స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్‌ను ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీని కేటాయించారు.**

ఈ అవకాశాన్ని మికెల్ ఒయర్జాబల్ గోల్‌గా మలచి స్పెయిన్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కూడా స్పెయిన్ తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ 58వ నిమిషంలో మరో గోల్ సాధించింది. డానీ ఓల్మోతో కలిసి అద్భుతమైన పాస్‌లు మార్చుకున్న పెడ్రో పోరో, గోల్ కీపర్ మైక్‌ను దాటుకుంటూ బంతిని నెట్‌లోకి పంపి స్పెయిన్ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కైలియన్ ఎంబాపే సహా ఇతర అటాకింగ్ ప్లేయర్లు పూర్తిగా తేలిపోయారు. స్పెయిన్ పటిష్ఠమైన డిఫెన్స్ వారిని పూర్తిగా కట్టడి చేసింది. దాంతో ఫ్రాన్స్ గోల్ చేసే అవకాశాలను కూడా సృష్టించుకోలేకపోయింది. వరుసగా మూడోసారి వరల్డ్ కప్ ఫైనల్ చేరాలన్న ఫ్రాన్స్ ఆశలకు ఈ ఓటమితో తెరపడింది. 14 ఏళ్లుగా కోచ్‌గా ఉన్న డిడియర్ డెషాంప్స్‌కు ఇది చేదు వీడ్కోలుగా మిగిలింది. తాజా విజయంతో 2010 నాటి స్వర్ణయుగాన్ని స్పెయిన్ గుర్తుకు తెచ్చింది. తమ జట్టు సమష్టిగా రాణించిందని, ముఖ్యంగా ఫ్రాన్స్ బలాలను అడ్డుకోవడంలో సఫలమయ్యామని స్పెయిన్ మేనేజర్ లూయిస్ డి లా ఫ్యూయెంటె ప్రశంసించాడు. ఆదివారం న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో జరిగే ఫైనల్‌లో అర్జెంటీనా-ఇంగ్లండ్ మధ్య జరిగే రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.





## ఫ్రాన్స్ కథ ముగిసింది!

**ఫిఫా వరల్డ్ కప్‌లో ఫేవరెట్ ఫ్రాన్స్ జట్టు సెమీఫైనల్ దాటలేకపోయింది. నంబర్ 1 ర్యాంకర్‌గా టోర్నీలో అడుగుపెట్టిన కిలియన్ ఎంబాపే బృందం స్పెయిన్ చేతిలో ఊహించని ఓటమితో ఇంటిదారి పట్టి.. ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీని కొనసాగించింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో నంబర్ 1 జట్టు కప్ కొట్టలేదు ఇంతవరకు. ఈ పరంపర ఇటీవల మొదలైంది కాదు.1994 నుంచి ఇదే సీన్ రిపీట్ అవుతూనే ఉంది. ఫిఫా గత రికార్డులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. ఆట ఏదైనా నంబర్ 1 ర్యాంక్‌లోని జట్లు, ఆటగాళ్లు ప్రధాన టోర్నీల్లో విజేతగా నిలవడం చూశాం. హాకీ, క్రికెట్, టెన్నిస్.. వంటివాటిలో టాప్ ర్యాంకర్స్ కప్ కొట్టిన సంఘటనలు చాలానే.**

ఫుట్‌బాల్ జట్లకు మాత్రం ఎందుకనో అగ్రస్థానం కలిసిరావడం లేదు. మెక్సికో, కెనడా, అమెరికా ఆతిథ్యమిస్తున్న ఫిఫా వరల్డ్ కప్ నుంచి ఫ్రాన్స్ నిష్క్రమణతో.. ఈ ఫస్ట్ ర్యాంక్ ఫోబియా నిజమనిపిస్తోంది. 1994 నుంచి ఇప్పటివరకూ టాప్ ర్యాంకర్ జట్టు ఛాంపియన్ కాలేదు. అసలు ఇదంతా ఎప్పుడు మొదలైందో తెలుసా.. 1993లో. తొలిసారిగా 1993లో ఫిఫా యాజమాన్యం ర్యాంకింగ్స్ ప్రకటించింది. అప్పటి నుంచి 2, 3 లేదా 4 వ ర్యాంకు.. ఆపై స్థానంలోని జట్లే కప్‌ను తన్నుకుపోయాయి. ఫిఫా ర్యాంకింగ్స్‌లో 2వ స్థానంలోని, కార్లోస్ డుంగా సారథ్యంలోని బ్రెజిల్ 1994లో ఛాంపియన్ కాగా.. 1998వ ఎడిషన్‌లో 14వ స్థానంతో బరిలోకి దిగిన ఫ్రాన్స్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ విజేతగా నిలిచింది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ 2022లో మళ్లీ రెండో స్థానంలోని బ్రెజిల్ కప్‌ను ముద్దాడింది. 2006 ఎడిషన్‌లో 13వ ర్యాంకర్ ఇటలీ ట్రోఫీని ఎగరేసుకుపోగా.. రెండో ర్యాంకర్లైన స్పెయిన్ 2010లో, జర్మనీ 2014లో ఫిఫా వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకున్నాయి. 2018లో ఫ్రాన్స్(7వ ర్యాంక్) విజేతగా నిలిచింది. ఖతార్ వేదికగా జరిగిన 2022 ఎడిషన్‌లో 3వ ర్యాంకర్ అర్జెంటీనా కప్ కొట్టింది. ఈసారి (2026) కూడా అదే సంప్రదాయం కొనసాగగా.. నంబర్ 1 ఫ్రాన్స్ సెమీస్‌లోనే ఇంటిముఖం పట్టింది. ప్రస్తుతం లియోనల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా రెండో స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ 4వ ర్యాంక్‌లో, ఫైనల్‌కు దూసుకెళ్లిన స్పెయిన్ 3వ స్థానంలో ఉన్నాయి. రెండో సెమీస్ ఫలితం తేలినా.. ఈ దఫాలోనూ కప్ కొట్టే జట్టు నంబర్ వన్ కాదనేది మరోసారి నిరూపితం కానుంది.



### తొలిరౌండ్ దాటని

## ఆయుష్, లక్ష్యసేన్

టోక్యోలో జరుగుతున్న జపాన్ ఓపెన్‌లో భారత యువ షట్లర్లు తీవ్రంగా నిరాశపరిచారు. ఇప్పటికే సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి జోడీ గాయంతో ఈ సూపర్ 750 టోర్నమెంట్ నుంచి నిష్క్రమించగా.. కుర్రాళ్లు లక్ష్యసేన్, ఆయుశ్ షెట్టిలు సైతం ఇంటిదారి పట్టారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లోనే సేన్, ఆయుశ్ ఓటమి పాలయ్యారు. స్థానిక షట్లర్ కొకి వటనాబే చేతిలో సేన్ కంగుతినగా.. థాయ్‌లాండ్‌కు చెందిన రెండో సీడ్ కున్లవుత్ విటిడ్సర్న్‌తో పోరాడి ఓడాడు ఆయుష్. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్‌లో భారత షట్లర్లు తేలిపోయారు. ఫేవరెట్ లక్ష్యసేన్, ఆయుష్ శెట్టిలు తొలిరౌండ్‌లోనే వెనుదిరిగారు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో జపాన్ కుర్రాడు కొకి వటనాబే ధాటికి సేన్ చేతులెత్తేశాడు. తొలి సెట్‌ను 16-21తో అలవోకగా కోల్పోయిన భారత స్టార్ రెండో సెట్‌లోనూ పుంజుకోలేదు. 17వ ర్యాంకర్ వటనాబె శక్తివంతమైన స్మాష్‌లతో విరుచుకుపడి 21-14తో గెలుపొందాడు. దాంతో సేన్ నిరాశగా కోర్టును వీడాడు.

## ఆదివారం ఫిఫా ముగింపు వేడుక

### ఆస్కార్, సినీ సెలబ్రిటీలకు ఆహ్వానం

ఫిఫా వరల్డ్ కప్ తుది అంకానికి చేరడంతో ముగింపు వేడుకలపై నిర్వాహకులు దృష్టి సారించారు. 48 జట్లతో మొదలైన ఈ మెగా టోర్నీ జూలై 19 ఆదివారంతో పూర్తి కానున్నందున.. అభిమానులను రంజింపజేసేందుకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. న్యూయార్క్‌లోని న్యూ జెర్సీ స్టేడియంలో జరుగనున్న 'క్లోజింగ్ సెరెమొనీ'లో హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్, ఇంటర్నెట్ సెన్సేషన్ 'ఐషోస్పీడీ' సహా పలువురు సినీ సెలబ్రిటీలు పాల్గొననున్నారు. సాకర్ అభిమానులను ఉత్కంఠతలూగిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ విజేత ఎవరో ఆదివారంతో తేలిపోనుంది. ఫ్రాన్స్‌ను చిత్తుచేసిన స్పెయిన్‌ను ఢీకొట్టే జట్టేదో రెండో సెమీఫైనల్‌లో ఖరారు కానుంది. దాంతో, టైటిల్ పోరుకు ముందు ఆనావాయితీ అయిన ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. న్యూ జెర్సీ స్టేడియంలో మ్యాచ్‌కు 90 నిమిషాల ముందు ఆటగాళ్లతో పాటు అభిమానులను అలరించేందుకు పలువురు సినీ సెలబ్రిటీలను ఆహ్వానించింది. ఆస్కార్ అవార్డు విజేత, గాయని జెన్నిఫర్ హడ్సన్ అమెరికా జాతీయ గీతాన్ని ఆలపించనుంది. ఆస్కార్ విజతే, అమెరికా నటుడు టామ్ క్రూజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాడు. రాబీ విలియమ్స్(ఇంగ్లిష్ గాయకుడు, గేయ రచయిత), లారా పాసిని(ఇటలీ పాప్



సింగర్), నికొలె షెర్జింజర్(అమెరికా గాయని)లు తమ గాత్రంతో ఫ్యాన్స్‌ను సంగీతసాగరంలో ఓలలాడించనున్నారు. ఇంటర్నెట్ సంచలనం యూట్యూబర్ ఐషోస్పీడ్ తన మార్క్ హావభావాలతో సందడి చేయనున్నాడు. 'ముగింపు వేడుకల్లో సంగీతం, సంస్కృతి, ఫుట్‌బాల్ థీమ్‌తో టోర్నమెంట్ మొత్తాన్ని ప్రతిబింబిస్తామ'ని వరల్డ్‌కప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ హీమో ష్లిర్గి వెల్లడించాడు. ఈ ముగింపు వేడుకల్లో మెరిసే తారలు, ప్రముఖుల జాబితాలో మరొకొందరు పేర్లు చేరే అవకాశముందని సమాచారం.

## కెప్టెన్సీకి సిద్ధమే: స్మృతి

లార్డ్స్‌లో జరిగిన ఏకైక టెస్టులో భారత జట్టు చరిత్రాత్మక విజయంలో భాగమైన స్మృతి మంధాన రాబోయే రోజుల్లో కొత్త బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. ప్రస్తుతం వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్న మంధాన టీమిండియా సిద్ధంగా ఉన్నానని చెబుతోంది. లార్డ్స్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ శతకాలతో మెరిసిన ఈ ఓపెనర్ టైమ్స్ ఆఫ్ ఇండియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో మీరు సారథ్యం వహించేందుకు సిద్ధంగా ఉన్నారా?' అనే ప్రశ్నకు 'నేను రెడీ' అని బదులిచ్చింది. భారత మహిళల జట్టు విజయాల్లో కీలకమవుతున్న స్మృతి మంధాన లార్డ్స్ టెస్టుతో మరోసారి తానెంత విలువైన క్రికెటరో చాటింది. ఇంగ్లండ్ బౌలర్లను ఉతికిస్తూ రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ శతకాల(83, 70)తో రెచ్చిపోయిన మంధాన.. వైస్ కెప్టెన్‌గా తన బాధ్యతను సమర్థంగా పోషించింది. ఇదే ఉత్సాహంతో అవకాశం రావాలేగానే కెప్టెన్‌గా రాణిస్తానని అంటోందీ ఓపెనర్. టైమ్స్ ఆఫ్ ఇండియా ఇంటర్వ్యూలో లార్డ్స్ టెస్టు విజయంపై మాట్లాడిన మంధాన.. 'హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో జట్టును నడిపించేందుకు మీరు సిద్ధంగా ఉన్నారా?' అనే ప్రశ్నకు 'అవును.. నేను రెడీ' అని చెప్పింది. 'ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో జరిగిన మహిళల ఏకైక టెస్టు ఆడడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా మ్యాచ్ గెలుపొందడం ఇంకా ఆనందంగా ఉంది. చరిత్రాత్మక మ్యాచ్‌లో భారత జట్టు విజయంలో భాగమవ్వడం నాకు చాలా ప్రత్యేకం. మేము చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు టెస్టు క్రికెట్ ఆడాలని కలలు కన్నాం. లార్డ్స్‌లో టెస్టు మ్యాచ్ ఆడడం మరపురానిది' అని మంధాన తెలిపింది.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# రైతు భవిష్యత్తు ఎటు?

తెలంగాణ రైతు జీవితం ఇప్పటికీ ఆకాశం చేతుల్లోనే ఉంది. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే రైతు మొదట చూస్తుంది వాతావరణ శాఖ బులెటిన్‌ను కాదు... ఆకాశాన్నే. నల్లని మేఘాలు కనిపిస్తే ఆశ పడతాడు. రెండు చినుకులు పడితే విత్తనాల సంచులు తెరుస్తాడు. మేఘాలు చెదిరిపోతే మళ్లీ ఆందోళనలో పడిపోతాడు. ఈ దృశ్యం దశాబ్దాలుగా మారడం లేదు. జూన్ నెల గడిచింది. జూలై కూడా ముందుకు సాగుతోంది. అయినా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. కొందరు రైతులు విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. మరికొందరు వర్షం పడే వరకు సాగును వాయిదా వేశారు. ఇంకొందరు అప్పులు చేసి కొనుగోలు చేసిన విత్తనాలు ఇంట్లోనే నిల్వ ఉంచి ఆందోళన చెందుతున్నారు. పొలంలో పంట మొలకెత్తకముందే రైతు గుండెల్లో భయం మొలకెత్తుతోంది. ప్రకృతి అనిశ్చితిని ఎవరూ నియంత్రించలేరు. కానీ ఆ అనిశ్చితి ప్రభావాన్ని తగ్గించే వ్యవస్థను మాత్రం ప్రభుత్వాలు నిర్మించగలవు. దురదృష్టవశాత్తు మన వ్యవసాయ విధానాలు ఇంకా వర్షాధార వ్యవసాయం అనే పాత చట్రం నుంచి పూర్తిగా బయటపడలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం పెరిగింది. భారీ ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, చెరువుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. అయినప్పటికీ నేడు అనేక గ్రామాల్లో రైతు ఇంకా వర్షం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండటం ఆలోచించాల్సిన విషయం. ప్రాజెక్టులు నిర్మించడం ఒక దశ అయితే, వాటి నిర్వహణ, నీటి పంపిణీ, చెరువుల అనుసంధానం, కాల్వల నిర్వహణ మరో కీలక దశ. ఈ ఏడాది అనేక చెరువులు పూర్తిస్థాయిలో పూడికతీత జరగకుండానే వర్షాకాలంలోకి ప్రవేశించాయి. ఫీడర్ కాల్వలు మూసుకుపోయిన ప్రాంతాలు ఉన్నాయి. వర్షపు నీరు నిల్వ కావాల్సిన చోట వృథాగా పారిపోతోంది. ఒకవైపు వర్షాల కోసం ఎదురు చూస్తూనే, మరోవైపు కురిసిన కొద్దిపాటి నీటిని కూడా నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడితే అది ప్రకృతి వైఫల్యం కాదు.. పాలనా నిర్లక్ష్యం. వాతావరణ మార్పులు వ్యవసాయానికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఒకప్పుడు క్రమంగా కురిసే వర్షాలు ఇప్పుడు కొద్ది రోజుల్లోనే భారీగా కురుస్తున్నాయి. తర్వాత వారాల తరబడి ఎండలు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంటల ఎంపిక కూడా మారాలి. తక్కువ కాలంలో పండే రకాలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలు, సూక్ష్మ సాగునీటి విధానాలు, నేల తేమను నిల్వ చేసే వ్యవసాయ పద్ధతులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. రైతు సమస్య వర్షంతో మాత్రమే ముగియదు. విత్తనాల ధరలు, నకిలీ విత్తనాల ముప్పు, ఎరువుల లభ్యత, కూలీల కొరత, మార్కెట్ ధరల అనిశ్చితి, పంట బీమా అమలులో జాప్యం.. ఇవన్నీ కలిసి రైతును మరింత బలహీనుడిని చేస్తున్నాయి. పంట పండినా గిట్టుబాటు ధరపై సందేహం, పండకపోతే పెట్టుబడి తిరిగి వస్తుందో లేదో అనే భయం వెంటాడుతోంది. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చాలంటే రైతుకు ముందస్తు సమాచారం అత్యంత కీలకం. గ్రామ స్థాయిలో ఖచ్చితమైన వాతావరణ అంచనాలు, నేల తేమ వివరాలు, పంటలపై శాస్త్రీయ సలహాలు, మొబైల్ ఆధారిత డిజిటల్ సేవలు అందుబాటులో ఉండాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు రైతు పొలం వరకు చేరాలి. ప్రయోగశాలల్లో ఉన్న విజ్ఞానం పొలాల్లోకి రాకపోతే దాని ప్రయోజనం ఉండదు. పంట బీమా వ్యవస్థను కూడా మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన రైతు నెలల తరబడి పరిహారం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండకూడదు. ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్లు, డిజిటల్ సర్వేల ద్వారా నష్టాన్ని త్వరగా అంచనా వేసి పరిహారం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. వ్యవసాయాన్ని కేవలం వర్షాలపై ఆధారపడి వదిలేయడం భవిష్యత్తులో మరింత ప్రమాదకరం. ప్రతి గ్రామంలో చెరువులు, ఫామ్‌పాండ్లు, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలు, భూగర్భ జలాల రీచార్జ్, సూక్ష్మ సాగునీటి పద్ధతులు సమగ్రంగా అమలైతేనే రైతుకు నిజమైన భరోసా లభిస్తుంది. ఇది ఖర్చు కాదు.. ఆహార భద్రతపై పెట్టుబడి.




# నిజమేది.. అబద్ధమేది?

**ఒకప్పుడు వార్తలు తెలుసుకోవాలంటే పత్రిక కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. రేడియో వార్తలు వినాల్సి వచ్చేది. టెలివిజన్ బులెటిన్లను చూడాల్సి వచ్చేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా కొన్ని క్షణాల్లోనే స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతోంది. ఈ మార్పుకు కారణం సోషల్ మీడియా. సమాచారాన్ని ప్రజల చేతుల్లోకి తీసుకువచ్చిన ఈ డిజిటల్ విప్లవం ప్రజాస్వామ్యాన్ని మరింత భాగస్వామ్యంగా మార్చింది. అయితే అదే సమయంలో ప్రజాస్వామ్యానికి కొత్త ప్రమాదాలనూ తీసుకొచ్చింది.**

ప్రజాస్వామ్యం అనేది సమాచారం ఆధారంగా ప్రజలు నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ. ప్రజలకు సరైన సమాచారం అందితేనే వారు సరైన నాయకులను ఎన్నుకోగలరు. ప్రభుత్వాలను ప్రశ్నించగలరు. ప్రజా విధానాలపై చర్చించగలరు. ఈ ప్రక్రియలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. గతంలో ప్రధాన మీడియాకు మాత్రమే పరిమితమైన సమాచార ప్రసారం నేడు ప్రతి పౌరుడి చేతిలోకి వచ్చింది. ఒక సామాన్యుడు కూడా తన అభిప్రాయాన్ని ప్రపంచానికి వినిపించే అవకాశం పొందాడు. సహజ విపత్తులు, ప్రమాదాలు, అవినీతి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు.. ఇవన్నీ సోషల్ మీడియా ద్వారా వేగంగా వెలుగులోకి వస్తున్నాయి. ఎన్నో సందర్భాల్లో అధికార యంత్రాంగం స్పందించేలా చేసింది. సామాజిక ఉద్యమాలకు ఊతమిచ్చింది. విపత్తుల సమయంలో సహాయక చర్యలను సమన్వయం చేసింది. ప్రజల గొంతుకగా నిలిచింది. ఈ కోణంలో చూస్తే సోషల్ మీడియా ప్రజాస్వామ్యానికి శక్తినిచ్చిన సాధనం. అయితే ప్రతి శక్తివంతమైన సాధనంలాగే దీనికీ మరో వైపు ఉంది. అదే తప్పుడు సమాచారం. నేడు ఫేక్ న్యూస్, పుకార్లు, కృత్రిమంగా తయారుచేసిన చిత్రాలు, వీడియోలు, డీప్‌ఫేక్‌లు, ద్వేషపూరిత ప్రచారం సోషల్ మీడియా ద్వారా అత్యంత వేగంగా వ్యాపిస్తున్నాయి. నిజం కంటే అబద్ధం వేగంగా ప్రయాణిస్తున్న కాలమిది. ఒకసారి తప్పుడు సమాచారం వైరల్ అయితే దాన్ని ఖండించే సమయానికి లక్షలాది మంది దానిని నమ్మే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రత్యేకించి ఎన్నికల సమయంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా ప్రచారంలో కీలక ఆయుధంగా మారింది. ఇది సహజమే. కానీ కొన్ని సందర్భాల్లో వాస్తవాల కంటే భావోద్వేగాలకు, వాస్తవాధారాల కంటే అపోహలకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. సమాజాన్ని మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో విభజించే ప్రచారం కూడా సోషల్ మీడియా ద్వారా వేగంగా వ్యాపిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. కృత్రిమ మేధ అభివృద్ధితో ఈ సవాళ్లు మరింత పెరిగాయి. నిజంగా మాట్లాడని వ్యక్తిని మాట్లాడినట్లు చూపించడం, అసలు జరగని సంఘటనలను జరిగినట్లు చూపించడం, వీడియోలను మార్చడం ఇప్పుడు సాంకేతికంగా చాలా సులభమైంది. ఎన్నికలు, సామాజిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ వివాదాల సమయంలో ఇటువంటి డీప్‌ఫేక్‌లు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మీడియా పాత్ర మరింత బాధ్యతాయుతంగా ఉండాలి. సంప్రదాయ వార్తా సంస్థలు సమాచారాన్ని ధృవీకరించి అందించే పద్ధతిని మరింత బలోపేతం చేయాలి. సోషల్ మీడియాలో వైరల్ అయ్యిందనే కారణంతో వార్తగా ప్రచురించడం ప్రమాదకరం. జర్నలిజం యొక్క మూల సూత్రాలైన వాస్తవ నిర్ధారణ, సమతుల్యత, బాధ్యతను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరాదు. అంతే కాదు, ప్రతి పౌరుడు కూడా డిజిటల్ పౌరుడిగా బాధ్యతతో వ్యవహరించాలి. ఒక సందేశం వచ్చిందని వెంటనే ఫార్వర్డ్ చేయడం కాకుండా దాని నిజానిజాలను పరిశీలించే అలవాటు పెంపొందించుకోవాలి. విశ్వసనీయ వనరుల నుంచి సమాచారాన్ని తెలుసుకోవాలి. భావోద్వేగాలను రెచ్చగొట్టే పోస్టులను చూసిన వెంటనే నమ్మకూడదు. డిజిటల్ అక్షరాస్యత ఇప్పుడు చదవడం, రాయడం ఎంత ముఖ్యమో అంతే ముఖ్యమైంది. ప్రభుత్వాలకూ ఈ విషయంలో కీలక బాధ్యత ఉంది. తప్పుడు సమాచారాన్ని అరికట్టే చట్టాలు అవసరమే. అయితే ఆ పేరుతో భావ ప్రకటనా స్వేచ్ఛను పరిమితం చేసే పరిస్థితి రాకూడదు. ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు, ప్రశ్నించే హక్కు, భిన్నాభిప్రాయం చెప్పే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు. కాబట్టి నియంత్రణకు, స్వేచ్ఛకు మధ్య సమతుల్యత అత్యంత అవసరం. సోషల్ మీడియా సంస్థలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. తప్పుడు సమాచారాన్ని వేగంగా గుర్తించే వ్యవస్థలు, డీప్‌ఫేక్‌లను గుర్తించే సాంకేతికత, పారదర్శక అల్గోరిథమ్‌లు, బాధ్యతాయుత కంటెంట్ నిర్వహణ వంటి అంశాల్లో మరింత కృషి చేయాలి. ఎందుకంటే ఇవి కేవలం ప్రైవేటు సంస్థలు మాత్రమే కాదు; నేడు ప్రజా చర్చల ప్రధాన వేదికలుగా మారాయి. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడంతో ముగిసిపోదు. అది సమాచారంపై ఆధారపడిన నిరంతర సంభాషణ. ఆ సంభాషణలో నిజం బలహీనపడితే ప్రజాస్వామ్యం కూడా బలహీనపడుతుంది.



- శ్రీకాంత్ చుక్కల

# సామాన్యుడి బతుకెట్ల?

**దేశ ఆర్థిక వ్యవస్థ బాగుందని గణాంకాలు చెబుతున్నాయి. జీడీపీ వృద్ధి నమోదవుతోంది. విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తోంది. కానీ ఈ అభివృద్ధి కథనం సామాన్యుడి వంటింట్లో కనిపిస్తోందా? అనే ప్రశ్నకు సమాధానం అంత సులభం కాదు. ఎందుకంటే నేడు ప్రతి కుటుంబం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి ఆహార ద్రవ్యోల్బణం. ఒకప్పుడు వారానికి ఒకసారి కూరగాయల మార్కెట్‌కు వెళ్లే కుటుంబాలు, ఇప్పుడు ధరలు చూసి కొనుగోళ్ల జాబితానే మార్చుకుంటున్నాయి.**



టమాటా, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, పప్పుధాన్యాలు, వంటనూనెలు, పాలు, పండ్లు.. ఏ వస్తువు ధర చూసినా గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. జీతాలు, ఆదాయాలు అదే వేగంతో పెరగకపోవడంతో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేద కుటుంబాలపై ఈ భారం మరింత ఎక్కువగా పడుతోంది. ఆహార ద్రవ్యోల్బణం ప్రభావం కేవలం ఖర్చు పెరగడమే కాదు. కుటుంబాల పోషకాహారంపై కూడా ప్రభావం చూపుతుంది. ధరలు పెరిగినప్పుడు ముందుగా తగ్గేది పండ్లు, పాలు, పప్పులు, పోషకాహారం వినియోగమే. ఫలితంగా పిల్లలు, గర్భిణులు, వృద్ధుల్లో పోషకాహార లోపం పెరిగే ప్రమాదం ఉంటుంది.

అందువల్ల ఆహార ద్రవ్యోల్బణం ఆరోగ్య సమస్యగా కూడా మారుతుంది. ఈ పరిస్థితికి అనేక కారణాలున్నాయి. వాతావరణ మార్పుల వల్ల పంటలు దెబ్బతినడం, అనిశ్చిత వర్షపాతం, ఎండలు, వరదలు, రవాణా వ్యయాల పెరుగుదల, ఇంధన ధరల ప్రభావం, నిల్వ సదుపాయాల కొరత, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు.. ఇవన్నీ ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ఒక ప్రాంతంలో వర్షాభావం వస్తే ఉత్పత్తి తగ్గుతుంది. మరో ప్రాంతంలో భారీ వర్షాలు వస్తే పంటలు నష్టపోతాయి. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌లో సరఫరా తగ్గి ధరలు పెరుగుతాయి. అంతర్జాతీయ పరిణామాలు కూడా భారత ఆహార మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ముడి చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చు పెరుగుతుంది. ఎరువుల ధరలు పెరిగితే సాగు వ్యయం పెరుగుతుంది. ప్రపంచ మార్కెట్‌లో తినే నూనెల ధరలు పెరిగితే దేశీయ మార్కెట్‌పై కూడా ప్రభావం పడుతుంది. అంటే ఇప్పుడు రైతు పొలం నుంచి వినియోగదారుడి వంటగది వరకు ప్రపంచ ఆర్థిక పరిస్థితుల ప్రభావం కనిపిస్తోంది. అయితే కేవలం ప్రకృతిని, ప్రపంచ పరిస్థితులను నిందించడం సరిపోదు. దేశంలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో ఇంకా అనేక లోపాలున్నాయి. రైతు అమ్మే ధరకు, వినియోగదారుడు కొనుగోలు చేసే ధరకు మధ్య భారీ అంతరం కనిపిస్తోంది. మధ్యవర్తుల ఆధిపత్యం, తగిన నిల్వ గిడ్డంగుల కొరత, కోల్డ్‌చైన్ వ్యవస్థ బలహీనత, మార్కెట్ సమాచార లోపం వంటి అంశాలు ధరల అస్థిరతను మరింత పెంచుతున్నాయి.

## పరిష్కారం ఏమిటి?

ముందుగా వ్యవసాయ ఉత్పత్తి స్థిరంగా పెరగాలి. వాతావరణ మార్పులకు తట్టుకునే పంటలపై పరిశోధన వేగవంతం చేయాలి. నీటి వినియోగాన్ని సమర్థవంతం చేయాలి. రైతులకు శాస్త్రీయ సలహాలు అందించాలి. కోల్డ్ స్టోరేజ్‌లు, గిడ్డంగులు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించాలి. దీంతో పంట నష్టాలు తగ్గి సరఫరా స్థిరపడుతుంది. ప్రభుత్వం కూడా ధరల నియంత్రణలో చురుకుగా వ్యవహరించాలి. అవసరమైనప్పుడు బఫర్ స్టాక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయడం, అక్రమ నిల్వలను అరికట్టడం, దిగుమతి-ఎగుమతి విధానాలను సమయానుకూలంగా సవరించడం, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించడం అవసరం. అదే సమయంలో రైతు ప్రయోజనం, వినియోగదారుడి ప్రయోజనం రెండింటి మధ్య సమతుల్యత సాధించాలి. రైతుకు గిట్టుబాటు ధర రావాలి. వినియోగదారుడికి అందుబాటు ధరలో ఆహారం లభించాలి. ఈ రెండింటిలో ఏదో ఒకదానికే ప్రాధాన్యం ఇస్తే సమస్య పరిష్కారం కాదు. మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు కారు. కానీ మార్కెట్ ధరలను పూర్తిగా భరించే స్థోమత కూడా లేదు. అందువల్ల ఆహార ద్రవ్యోల్బణం భారాన్ని అత్యధికంగా మోస్తున్న వర్గం ఇదే. కుటుంబ బడ్జెట్‌లో ఆహార వ్యయం వాటా పెరగడంతో విద్య, ఆరోగ్యం, పొదుపు వంటి అవసరాలపై ఖర్చు తగ్గుతోంది. భవిష్యత్తులో వాతావరణ మార్పులు మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఆహార భద్రతను కేవలం వ్యవసాయ శాఖ బాధ్యతగా కాకుండా జాతీయ ఆర్థిక వ్యూహంలో భాగంగా చూడాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెటింగ్, వినియోగం.. ఈ మొత్తం వ్యవస్థను ఆధునికీకరించాల్సిన సమయం వచ్చింది. ఆహార ద్రవ్యోల్బణం అనేది గణాంకాల్లో కనిపించే శాతం మాత్రమే కాదు. అది ప్రతి ఇంటి వంటగదిలో, ప్రతి కుటుంబ బడ్జెట్‌లో, ప్రతి తల్లి చేతిలో కనిపించే వాస్తవం. ధరలు పెరిగినప్పుడు మొదటగా తగ్గేది విలాసవంతమైన ఖర్చులు కాదు.. చాలా కుటుంబాల్లో పోషకాహారమే. దేశ అభివృద్ధిని కేవలం జీడీపీతో మాత్రమే కొలవలేం. సామాన్యుడి వంటగదిలో పొయ్యి ఎంత ప్రశాంతంగా మండుతోంది? కుటుంబం పోషకాహారాన్ని ఎంత సులభంగా కొనుగోలు చేయగలుగుతోంది? అనే అంశాలు కీలకం.



శశిధర్ అక్కెల


రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.